# ఉన్నత స్థాయికి చేరుకోవడమే లక్ష్యంగా
# కృషి చేయాలి

- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- ఆర్థికంగా బలోపేతం కావడం మహిళలకు కీలకం
- గిరిజన సంక్షేమ బాలికల గురుకుల డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న జాబ్ మేళా కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్





**ఖమ్మం నవభూమి బ్యూరో, మార్చి 26:** మనం ఎన్నుకున్న రంగంలో అత్యున్నత స్థాయికి ఎదగడమే లక్ష్యంగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. బుధవారం తనికెళ్ళలోని తెలంగాణ గిరిజన సంక్షేమ బాలికల గురుకుల డిగ్రీ కళాశాలలో జిల్లా ఉపాధి అధికారి కార్యాలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాబ్ మేళా కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా మహిళల పట్ల చిన్న చూపు ఉన్న దశలో ఎలాంటి చర్చ లేకుండానే మహిళలకు ఓటు హక్కును మన భారత దేశం కల్పించిందని అన్నారు. ఆర్థికంగా బలోపేతం కాక పోవడమే మహిళల పట్ల ఉన్న



వివక్షకు కారణమని గమనించిన ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం అమలు ప్రారంభించిందని అన్నారు. చదువులో బాలుర కంటే అధికంగా బాలికలు రాణిస్తున్నారని కలెక్టర్ తెలిపారు. ఆడపిల్ల పుడితే గర్వ కారణం అని చాటి చెప్పేందుకు జిల్లాలో గర్ల్ ప్రైడ్ అనే వినూత్న కార్యక్రమం ప్రారంభిస్తున్నామని, జిల్లాలో ఎక్కడ ఆడపిల్ల పుట్టినా జిల్లా అధికారి స్వీట్ బాక్స్ తో వెళ్ళి ఆ కుటుంబానికి శుభాకాంక్షలు తెలుపడం జరుగుతుందని అన్నారు. ప్రస్తుతం సంక్షేమ హాస్టల్లో ఉన్న బాలికలకు అధిక బాధ్యత ఉందని, మిమ్మల్ని ఆదర్శంగా తీసుకునేందుకు చాలామంది ఎదురు చూస్తున్నారని, మీరు రాణించి అందుబాటులో ఉన్న అవకాశాలను వినియోగించుకొని ఉన్నత స్థాయికి చేరుకొని నలుగురికి ఆదర్శం కావాలని కలెక్టర్ తెలిపారు. గత తరాల మహిళలకు చదువుకునేందుకు అవకాశాలు లభించలేదని, తన అమ్మమ్మ పెళ్లి తర్వాత



చదువుకున్నారని, ప్రస్తుతం తమ కుటుంబం అంతా చదువుకొని మంచి స్థానంలో ఉండేందుకు అమ్మమ్మ కారణమని, తన భార్య కూడా యూపిఎస్సి రాసి ఢిల్లీలో ఉన్నత బాధ్యతలో ఉన్నారని కలెక్టర్ తెలిపారు. ఎన్నికల సమయంలో మహిళలకు ధైర్యం కల్పించి ఎన్నికల విధులు కేటాయిస్తే చిత్తశుద్ధితో నిర్వహించి నాలుగు కోట్ల నగదు, మద్యం, బంగారం జప్తు చేసి పారదర్శకంగా ఎన్నికల నిర్వహణలో కీలకమైన పాత్ర పోషించారని కలెక్టర్ తెలిపారు. మహిళలకు చేయలేని పని అంటూ ఏదీ ఉండదని, మనలో ఉన్న సామర్థ్యంపై నమ్మకం పెంచుకోవాలని అన్నారు. మన జీవితంలో ధైర్యం చేస్తేనే పైకి ఎదుగుతామని, ఇతరుల మాటలు పట్టుకుంటే ఏమీ సాధించలేమని అన్నారు. ప్రతి రంగంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలనే లక్ష్యాన్ని ప్రతి మహిళ నిర్దేశించుకోవాలని అన్నారు. ఖమ్మం జిల్లా ప్రభుత్వ విద్యా సంస్థలలో ఉత్తమమైన ప్రతిభ కలిగిన విద్యార్థినులు ఉన్నారని, వీరికి ప్రైవేట్ కంపెనీలోఅవకాశం కల్పిస్తే తప్పనిసరిగా రాణిస్తారని, కంపెనీలకు విశ్వాసంగా ఉంటూ వాటి అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తారని కలెక్టర్ తెలిపారు.

చిన్నతనంలో 7వ తరగతి చదివే సమయంలో విజయలక్ష్మి మేడం అనే టీచర్ బోధన పద్ధతులు మార్చి తనపై తీసుకున్న శ్రద్ధ కారణంగానే తాను నేడు కలెక్టర్ స్థాయికి చేరుకున్నానని అన్నారు. టీచర్ల విలువ ఎప్పటికీ మర్చిపోవద్దని, వారి శ్రమ ఫలితం వృధా కాకుండా ప్రతి ఒక్కరూ ఉన్నత స్థాయికి చేరుకోవాలని కలెక్టర్ ఆకాంక్షించారు. జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకున్న తర్వాత మనం మరో నలుగురికి సహాయం చేయాలని, సమాజంలో ఇతరుల అభివృద్ధికి మనం తోడ్పాటు అందిస్తే వచ్చే సంతృప్తి మరో కార్యక్రమంలో ఉండదని కలెక్టర్ తెలిపారు. జిల్లా ఉపాధి అధికారి ఎన్. మాధవి



మాట్లాడుతూ మా పాప మా ఇంటి మణి దీపం అనే కార్యక్రమాన్ని జిల్లాలో ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. చదువు మాత్రమే మనల్ని కాపాడుతుందని, ఈ అంశం ప్రతి మహిళ గుర్తుంచుకోవాలని అన్నారు. ప్రస్తుత జాబ్ మేళాలో మనకు వచ్చేది మొదటి అవకాశం మాత్రమేనని, హైదరాబాద్, బేంగళూరు వంటి నగరాల్లో అనేక అవకాశాలు వస్తాయని, మన ప్రతిభను ఎప్పటికప్పుడు అప్డేట్ చేసుకుంటూ ఉన్నత స్థాయికి ఎదగాలని అన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఇంటర్వ్యూ ప్రక్రియను పరిశీలించారు. అంతకు ముందు ప్రిన్సిపాల్ చాంబర్ లో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ గురుకులం నిర్వహణ, అభివృద్ధి పనులపై సమీక్షించారు. జాబ్ మేళాలో వచ్చిన కంపెనీలు, ఉపాధి అవకాశాల గురించి చర్చించారు. జాబ్ మేళాలో ఎంపికైన మహిళలకు ఫైనాన్షియల్ ప్లానింగ్ పై శిక్షణ అందించాలని అన్నారు. మహిళలకు ఆర్థిక స్వావలంబన చాలా ముఖ్యమని అన్నారు. ప్రస్తుతం వచ్చే జాబ్స్ ఎలా ఉంటాయ్, భవిష్యత్తులో ఎటువంటి అవకాశాలు వస్తాయి, ఎటువంటి కోర్సులు నేర్చుకోవాలి, రాబోయే రోజుల్లో మరో డిగ్రీ ఎలా పొందాలి వంటి అంశాలను ప్లాన్ చేసుకునేలా మహిళలను సిద్ధం చేయాలని కలెక్టర్ తెలిపారు. గురుకుల హాస్టల్ లో ఫర్నిచర్, బుక్స్ కోసం ప్రతిపాదనలు అందించాలని అన్నారు. మార్చి లోపు గ్రౌండ్ చేసేందుకు ఆస్కారం ఉన్న ప్రతిపాదనలు మాత్రమే పంపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. రజిత, ఉపాధ్యాయులు, కంపెనీ ప్రతినిధులు, విద్యార్థినులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.









# భద్రాచలంలో ఘోర ప్రమాదం

- ఆరు అంతస్తుల భవనం కూలి ఆరుగురు మృతి





**భద్రాచలం మార్చి 26 నవభూమి ప్రతినిధి:** భద్రాచలం సూపర్ మార్కెట్ కి దగ్గర్లో ఉన్న బోనాల బజార్ లో నిర్మాణంలో ఉన్న ఆరు అంతస్తులు భవనం గురువారం మధ్యాహ్నం మూడు గంటల సమయంలో కుప్పకూలింది. ఈ దుర్ఘటనలో ఆరుగురు మృతి చెందారు. శ్రీపతి నిలయం ట్రస్ట్ పేరుతో బహుళ అంతస్తుల భవనం గత 10 నెలల నుంచి నిర్మాణం చేస్తున్నారు. బుధవారం ఒక్కసారిగా కుప్ప కూలడంతో శిథిలాల కింద గ్రౌండ్ ఫ్లోర్లో పనిచేస్తున్న కూలీలు ఆరుగురు ఉన్నట్లు తెలిసింది. వారు అందులో చిక్కుకుని ఆర్తనాదాలు చేసి చనిపోయినట్లు చుట్టుపక్కల ప్రజలు తెలిపారు. భద్రాచలం పట్టణం ఏజెన్సీ ఏరియాలో 170 యాక్ట్ కి విరుద్ధంగా బహుళ అంతస్థుల సరైన అనుమతులు లేకుండా నిర్మాణాలు జరుపుతున్న అధికారులు పట్టించుకోవడంలేదని పలువురు ప్రజలు విమర్శలు చేస్తున్నారు. ఈ నిర్మాణం శ్రీపతి శ్రీనివాసు అనే వ్యక్తి ట్రస్ట్ పేరుతో పాత బిల్డింగ్ పై పాత పిల్లర్లపై ఆరు అంతస్తుల బిల్డింగు గోడలు లేకుండా నిర్మించారు. క్రింద గ్రౌండ్ ఫ్లోర్ లో పనులు జరుగుతున్న సమయంలో ఒక్కసారిగా కూలిపోవడం జరిగిందని స్థానిక ప్రజలు తెలిపారు . ఈ ప్రమాదం జరిగిన వెంటనే స్థానిక సీఐ పోలీస్ సిబ్బంది. రెస్క్యూ టీం తో సహాయ చర్యలు చేపట్టారు. ఈ ప్రమాద ఘటన స్థలానికి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్, ఏ ఎస్ పి, జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ స్థానిక ఎమ్మార్వో తదితర అధికారులు ఘటనా స్థలానికి చేరుకొని సహాయ చర్యలు పర్యవేక్షించారు. ఇంకా వివరాలు తెలియాల్సి ఉంది.

# భద్రాచలం ఘటనపై
# మంత్రి తుమ్మల దిగ్భ్రాంతి

- చేపడుతున్న సహాయ చర్యలపై మంత్రి ఆరా

**కొత్తగూడెం మార్చి 26 నవభూమి ప్రతినిధి:** భద్రాచలం పట్టణం నిర్మాణంలో ఉన్న భవనం కూలి ఆరుగురు మృతి పట్ల రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు .హైదరాబాదులో ఉన్న మంత్రి భద్రాచలం ఘటన పై బుధవారం జిల్లా అధికారులతో ఫోన్లో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు.శిధిలాలు కింద చిక్కుకున్న కార్మికులను వెంటనే ఆసుపత్రికి చేర్పించి



మెరుగైన వైద్య సహాయం అందించాలని మంత్రి తుమ్మల అధికారులు ఆదేశించారు. ఇటువంటి సంఘటనలు దురదృష్టకరమని చనిపోయిన కుటుంబాలకు మంత్రి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.పరిస్థితి పూర్తిగా పర్యవేక్షించాలని అధికారులు ఆదేశించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా అధికారులు పగడ్బందీ చర్యలు తీసుకోవాలని మంత్రి తుమ్మల ఆదేశించారు.

# బెట్టింగ్,గంజాయి వంటి వాటికి దూరంగా ఉండాలి

■ యువతకు ఇల్లెందు డిఎస్పీ చంద్రభాను విజ్ఞప్తి





**టేకులపల్లి మార్చి 27 నవభూమి ప్రతినిధి:** ఐపీఎల్ బెట్టింగు, గంజాయి, గుట్కా తదితర మారక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, వాటికి బానిసలుగా మారవద్దని ఇల్లందు డిఎస్పి చంద్రభాను యువతకు విజ్ఞప్తి చేశారు. టేకులపల్లిలోని వాగొడ్డుతండా, బి కాలనీలో బుధవారం తెల్లవారుజామున స్థానిక పోలీసులు స్నిఫర్ డాగ్ సహాయంతో ఇంటింటిని తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో సరియైన ధ్రువపత్రాలు లేని 36 మోటార్ సైకిల్ లను సీజ్ చేసినట్టు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా డి.ఎస్.పి యూత్ ను ఉద్దేశించి మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, గంజాయి, ఐపీఎల్ బెట్టింగ్ వంటి వాటికి దూరంగా ఉండాలని, వీటి బారిన పడి అనేకమంది ఆర్థికంగా నష్టపోయారని, అదే క్రమంలో ఆత్మహత్యలకు కూడా పాల్పడుతున్నారని ఆయన వివరించారు. చెడు వ్యసనాలకు యువకులు ఆకర్షింపబడకూడదని, వారి పైన కుటుంబాలు ఆధారపడి ఉన్నాయనే విషయాన్ని మర్చిపోవద్దని ఆయన పేర్కొన్నారు. వేసవికాలం వచ్చిందని, ఈ కాలంలో దొంగతనాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉంటుందని, కావున చాలా జాగ్రత్తగా ఉండాలని గ్రామస్తులకు విజ్ఞప్తి చేశారు. గుడుంబా తయారు చేయడం చట్టరీత్యా నిషేధమని, అలాంటి వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని డీఎస్పీ తెలియజేశారు. కాగా సీజ్ చేసిన వాహనాల ధ్రువీకరణ పత్రాలను పరిశీలించిన అనంతరం వాటిని విడుదల చేయటం జరుగుతుందని పోలీసులు పేర్కొన్నారు.

# జ్యోతిబాపూలే బాలుర హాస్టల్లో వైద్య శిబిరం



**టేకులపల్లి మార్చి 26 నవాభూమి ప్రతినిధి:** స్థానిక మహాత్మా గాంధీ జ్యోతిబాపూలే బాలుర హాస్టల్ లో మండల వైద్యాధికారి డాక్టర్ కందుల దినేష్ , వైద్య బృందం కలిసి వైద్య శిబిరం నిర్వహించారు. పిల్లలకు ఎండాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వచ్చేవ్యాధులు, పరీక్షల సమయంలో తీసుకోవాల్సిన పోషకాహారం, క్షయ, కుష్టు వంటి అంటూ వ్యాధులు, చర్మవ్యాధులపై అవగాహన కల్పించారు. పరీక్షల సమయంలో ఒత్తిడి, ఆందోళనలకు దూరంగా, ప్రశాంతంగా ఉండాలని, ఎక్కువ మంచినీరు తీసుకోవాలని, ఎక్కువ శక్తినిచ్చే ఆహార పదార్థాలైన ప్రోటీన్లు కలిగిన గుడ్డు, పప్పులు, పెరుగు, పాల ఉత్పత్తులు తీసుకోవాలని, తగినంత నిద్ర, పరీక్షలు విజయవంతంగా ముగించడానికి ఉపయోగపడతాయని, అలాగే వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం ఆరోగ్యకరమని పిల్లలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ రవీందర్, ఆరోగ్య విస్తరణ అధికారి దేవా, స్టాఫ్ నర్స్ రేష్మ, ఏఎన్ఎం సులోచన, చంద్రకళ, మజహరి, సుజాత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# నేటి ఆడపిల్లలే మా బంగారు తల్లులు

## ఐసిడిఎస్ స్పెషల్ ఆఫీసర్ సునీత



**సత్తుపల్లి, నవభూమి, మార్చి 26 :** ఆడపిల్లలకు బంగారు భవిష్యత్తు ఉందని వారిని సంరక్షించాల్సిన బాధ్యత తల్లిదండ్రులకు ఉందని పుట్టబోయే ఆడపిల్లలందరూ మా బంగారు తల్లులని ఐ సి డి ఎస్ స్పెషల్ ఆఫీసర్ సునీత అన్నారు. ఐసిడిఎస్ కల్లూరు ప్రాజెక్ట్ సిడిపిఓ నిర్మల జ్యోతి ఆధ్వర్యంలో ఆడపిల్లకు జన్మనిచ్చిన అశ్విని బాలింత గృహంలో బేటి జన్మోత్సవ్ కార్యక్రమం నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారి సునీత మాట్లాడుతూ అశ్విని కుటుంబాన్ని అభినందించి, భర్త అత్త మామలను సన్మానించి స్వీట్ బాక్స్ ను, ప్రశంసా పత్రాన్ని అందించారు. సిడిపిఓ నిర్మల జ్యోతి మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం మార్చి నెలలో పుట్టిన ఆడపిల్లల కుటుంబాలను న్యూ బోర్న్ బేబీ సెలబ్రేషన్ ప్రోగ్రాం లో భాగంగా సన్మానించామన్నారు. సమాజంలో ఆడపిల్లల పట్ల ఉన్న వివక్షతను తొలగించి పుట్టిన ఆడపిల్లలను ప్రోత్సహించాలని ప్రాజెక్ట్ పరిధిలో పుట్టిన ఆడపిల్లల తల్లిదండ్రుల కుటుంబాన్ని ప్రతి బుధవారం వారి ఇంటి వద్దకు వెళ్లి సన్మాన కార్యక్రమం నిర్వహించామన్నారు . ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు సంధ్యారాణి, సుజాత,భవాని,వెంకటమ్మ అంగన్వాడి టీచర్ జమున తదితరులు పాల్గొన్నారు.

# 29న తైబజార్ వేలం: కమిషనర్ భాస్కర్ రెడ్డి

**నాగారం,మార్చి26,(నవభూమి న్యూస్):** నాగారం మున్సిపాలిటీ 2025-26 ఆర్థిక సంవత్సరం కు సంబంధించి తైబజార్ బహిరంగ వేలం పాటను ఈ నెల 29 శనివారం రోజున మధ్యాహ్నం 12.30 గంటలకు వేలం పాటను నిర్వహిస్తున్నట్లు నాగారం మున్సిపల్ కమిషనర్ భాస్కర్ రెడ్డి తెలిపారు. ఈ వేలం పాటలో పాల్గొనే వారు రూ. 2 లక్షల రూపాయలతో నాగారం మున్సిపల్ కమిషనర్ పేరున డి.డి లేదా నగదు తీసి తేది:29-03-2025 న శనివారం ఉదయం 11.30 గంటలలోపు మున్సిపల్ కార్యాలయంలో సమర్పించి వేలంలో పాల్గొనవలసిందిగా నాగారం మున్సిపల్ కమిషనర్ భాస్కర్ రెడ్డి కోరారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పథకాలను కార్యకర్తలు ప్రజలకు వివరించాలి

■ రాష్ట్ర మార్క్ఫెడ్ మాజీ డైరెక్టర్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల

■ బిఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వంపై చేస్తున్న అసత్య ఆరోపణలను తిప్పికొట్టాలి

■ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ కార్యకర్తలు సత్తా చాటాలి



**పాల్వంచ మార్చి 26 నవభూమి ప్రతినిధి:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను కాంగ్రెస్ కార్యకర్తలు ప్రజలకు వివరించాలని రాష్ట్ర మార్క్ఫెడ్ మాజీ డైరెక్టర్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. పట్టణ పరిధి లోని అయ్యప్ప నగర్ లోగల మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయంలో బుధవారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా అయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్టంలోని అన్ని వర్గాల ప్రజలకు అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందన్నారు. మహిళలకు ఉచిత రవాణా సౌకర్యం, 200 యూనిట్లలోపు ఉచిత కరెంటు, సబ్సిడీపై గ్యాస్, రైతు రుణమాఫీ, రైతు భరోసా, సన్న ధాన్యం కొనుగోలుపై క్వింటాలుకు 500 రూపాయల బోనస్ వంటి అనేక పథకాలు చేపడుతున్నదని, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి ప్రచారం గావించాలన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తలు తమ సత్తా చాటాలని కొత్వాల అన్నారు. బిఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వం పై చేస్తున్న అసత్య ఆరోపణలను తిప్పికొట్టాలని, ఇటీవల బిఆర్ఎస్ పార్టీ, కాంగ్రెస్ ప్రభుత్వం పై గోబెల్స్ ప్రచారాలతో ఆరోపణలు చేస్తున్నారని, కాంగ్రెస్ కార్యకర్తలు వారి అసత్య ఆరోపణలను తిప్పికొట్టాలని కోరారు. రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచి, రాష్ట్ర ప్రజలను తాకట్టు పెట్టిన ఘనత బిఆర్ఎస్ ప్రభుత్వానిదే న న్నారు. తెలంగాణాను అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే హక్కు బిఆర్ఎస్ నాయకులకు లేదన్నారు. ఈ సమావేశం లో మాజీ జడ్పీటీసీ సభ్యులు యర్రంశెట్టి ముత్తయ్య, ఎల్ డి ఎం కోఆర్డినేటర్ బద్ది కిషోర్, కాంగ్రెస్ నాయకులు ఎస్వీఆర్కే ఆచార్యులు, కాల్వ భాస్కర్ రావు, దేవీలాల్, మిరియాల కమలాకర్, గంగిరెడ్డి భువన సుందర్ రెడ్డి, కొమ్రరాజు విజయ్, డిష్ నాగేశ్వరరావు, సామా వెంకట రెడ్డి, పైడిపల్లి మహేష్, కందుకూరి రాము, దారా చిరంజీవి, మస్నా శ్రీనివాస్, బాషా, దప్పు రాము, సందు ప్రభాకర్, ధర్మసోత్ ఉపేందర్, మధు, షఫి, గణేష్, కొత్తపల్లి రవి, ఉండేటి శాంతివర్ధన్ తదితరులు పాల్గొన్నారు

# రూ.4 కోట్లు నష్టపోయిన కాంట్రాక్టు కార్మికులు: ఐఎన్టియుసి



**బూర్గంపాడు మార్చి 26 నవభూమి:** 13వ వేతన ఒప్పందములో కాంట్రాక్టు కార్మికుల మినిట్స్ ఆఫ్ ది కన్సాలిడేషన్ ప్రొసీడింగ్స్ 6 ఏప్రిల్ 2022, క్లాజు నెం.4 స్కిల్ అప్ గ్రేడేషన్ ప్రకారం మిల్లులో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు స్కిల్డ్ మ్యాట్రిక్స్ అమలు చేయాలని, ఇన్ టైం లో యల్ టీ ఏ పూర్తి అయినప్పటికి థర్డ్ పార్టీ సర్వే పేరుతో రెండున్నర సంవత్సరాల కాలయాపన చేసి దీనిని 1 అక్టోబర్ 2024 నుండి అమలు చేస్తున్నామని కాంట్రాక్టు కార్మికులకు తెలియజేయడం జరిగింది. దీని వల్ల సుమారు 4 కోట్ల రూపాయలు కాంట్రాక్టు కార్మికులు నష్టపోయారు. థర్డ్ పార్టీ సర్వే పేరుతో యాజమాన్యం, గుర్తింపు సంఘం కుమ్మక్కై తీసుకున్న నిర్ణయం వల్ల కాంట్రాక్టు కార్మికులలో తీవ్రమైన వ్యతిరేకత నెలకొనయుంది. కావున గతంలో వలే ఈ క్రింది అంశాల ప్రకారం స్కిల్డ్ మ్యాట్రిక్స్ను అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నాము. ఐ ఎన్ టి యు సి మిత్ర పక్షులు డిమాండ్ చేస్తుంది. ఈ కార్యక్రమంలో ఐ ఎన్ టి యు సి మిత్రపక్షాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గోనె రామారావు, యారం పిచ్చిరెడ్డి, ఐ ఎన్ టి యు సి మిత్రపక్షాల నాయకులు, కార్యకర్తలు, కాంట్రాక్టర్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు

## ప్రజలకు మౌలిక వసతులు కల్పనే మున్సిపాలిటీ లక్ష్యం: కమిషనర్ నరసింహ



**సత్తుపల్లి, నవభూమి, మార్చి 26:** ప్రజలకు మౌలిక వసతులు కల్పించడమే మున్సిపాలిటీ లక్ష్యమని సత్తుపల్లి మున్సిపల్ కమిషనర్ నరసింహ అన్నారు. బుధవారం పట్టణములో డ్రైనేజీలు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్న రోడ్లను క్షేత్రస్థాయిలో ఏఈ సురేష్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ సీసీ రోడ్లు, తాగునీరు, డ్రైనేజీలు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్న రోడ్లను పరిశీలించారు.పలు రోడ్లలో ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు పెరగడంతో నివాసగృహాలకు ఇబ్బంది కలుగుతుందన్నారు. పిచ్చి మొక్కల వలన దోమల బెడద ఎక్కువైంది అన్నారు. డ్రైనేజీల్లో నీరు నిలిచి పాకుడు బట్టి దుర్వాసన రావటానికి గమనించారు. వీటి ప్రభావంతో అనేక రకాల వ్యాధులకు గురవు తున్నామని ప్రజలు కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రజలు ఎదుర్కొంటున్న అన్ని సమస్యల్ని త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. వేసవికాలంలో నీటి సమస్య రాకుండా చూస్తామన్నారు. అవసరమైతే ట్యాంకర్ల ద్వారా నీటిని సప్లై చేస్తామని హామీ ఇచ్చారు. డ్రైనేజీలు, నీటి పంపులు, సీసీ రోడ్లు లేని ప్రాంతాలను గుర్తించామని అన్ని మౌలిక సౌకర్యాలు ఏర్పాటు చేస్తామని, ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించడం కోసం ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలను తొలగిస్తామని, నీరు ఆగి పాకుడు పట్టిన డ్రైనేజీలను శుభ్రం చేయిస్తామన్నారు

## ముస్లిం ఓట్ల కోసం మోదీ రంజాన్ తోఫా పథకం

### జిల్లా మైనారిటీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు యాకుబ్ పాషా



**పాల్వంచ మార్చి 26 నవభూమి ప్రతినిధి:** ఈ ఏడాది చివర్లో బీహార్ రాష్ట్రంలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ముస్లిం ఓట్లను దండుకోవాలనే కుటిల లక్ష్యంతో ప్రధాని నరేంద్ర మోదీ 'సౌగాత్ ఏ మోదీ' పేరుతో 32 లక్షల మంది పేద ముస్లింలకు రంజాన్ తోఫాలను అందించే పథకానికి శ్రీకారం చుట్టారని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మైనారిటీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎండీ.యాకూబ్ పాషా బుధవారం ఒక ప్రకటనలో దుయ్యపట్టారు. గత 10 యెండ్లలో మోదీ ప్రభుత్వానికి రంజాన్ పండుగ కానరాలేదని అన్నారు. ముస్లింలను విద్యాపరంగా, ఆర్థికంగా, సామాజిక పరంగా తొక్కిపెట్టడానికి 2022 నుంచి ప్రీ -మెట్రిక్, పోస్ట్ - మెట్రిక్, మెరిట్ కమ్ మీన్స్ బేస్డ్ ఉపకార వేతనాలను రద్దు చేసి పేద ముస్లింల నోటి దగ్గర ఉన్న కూటిని లాక్కొన్నారని అన్నారు. దీంతో పాటు అబుల్ కలాం ఫెలోషిప్ ను కూడా రద్దు చేసారని అన్నారు. అదే విధంగా వక్ఫ్ సవరణ బిల్లుకు శ్రీకారం చుట్టారని అన్నారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తే ముస్లిం రిజర్వేషన్లను రద్దు చేస్తామని బహిరంగంగా ప్రకటించిన మోదీ, అమిత్ షాలకు ఈనాడు ముస్లింలు గుర్తుకు వస్తున్నారా అని ప్రశ్నించారు. ఎస్సీ, ఎస్టీల కన్నా, ముస్లింల స్థితిగతులు అధ్వాన్నంగా ఉన్నాయని జాతీయ స్థాయిలో పలు కమిషన్లు తమ నివేదికలలో పేర్కొన్నపటికి, వాటన్నింటినీ పెడచెవిన పెట్టి ముస్లింలను అణగతొక్కే ఆలోచనలతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కంకణం కట్టుకుందని అన్నారు. నిజంగా ముస్లింల పట్ల ప్రేమ ఉన్నట్లయితే విద్యా, ఉద్యోగ రంగాల్లో ముస్లింలకు తగు ప్రాతినిధ్యం కల్పించే విధంగా చట్టాలు అమలు చేయాలని, రంజాన్ తోఫాలతో ముస్లింల స్థితిగతులు మారవని, మోదీ తోఫా ఇస్తేనే పండుగ చేసుకొనే స్థితిలో దేశంలో ముస్లింలు లేరని అన్నారు

## క్రీడలు మానసిక ఉల్లాసాన్ని శారీరక దృఢత్వాన్ని ఇస్తాయి

- డిప్యూటీ డైరెక్టర్ మణెమ్మ
- క్రీడా ఎంపికలను జండా ఊపి ప్రారంభించిన ఐటిడిఎ డిడి

**పాల్వంచ టౌన్ మార్చి 26 నవభూమి ప్రతినిధి:** పాల్వంచ మండల ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆదర్శ క్రీడా పాఠశాల కిన్నెరసానిలో ఐదవ తరగతి ప్రవేశానికి విద్యార్థులకు బుధవారం పలు అంశాలపై పరీక్షలు నిర్వహించారు. ఈ క్రీడా ఎంపికలో 110 మంది విద్యార్థులు బ్యాటరీ టెస్ట్ పరీక్షలకు హాజరయ్యారన్నారు. క్రీడల్లో భాగంగా ఫ్లెక్సిబిలిటీ టెస్ట్, 800 పరుగు పందెం, మెడిసిన్ బాల్,విద్యార్థి బరువు ఎత్తు, హై జంప్ అంశాలపై పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఐటిడిఏ డిప్యూటీ డైరెక్టర్ టి డబ్ల్యూ మణెమ్మ మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల పట్ల ఆసక్తి కలిగి ఉండి, జాతీయస్థాయిలో క్రీడలు ఆడేవిధంగా తయారు కావాలని, క్రీడలు మానసిక ఉల్లాసాని శారీరక దృఢత్వాన్ని పెంపొందిస్తుందని క్రీడల వలన ఏకాగ్రత పెరిగి చదువులో రాణిస్తారని డిప్యూటీ డైరెక్టర్ మణెమ్మ అన్నారు. ప్రతి విద్యార్థుల తల్లిదండ్రులు బిడ్డల భవిష్యత్తు కోసం విద్యాభివృద్ధి కోసం విషయాలను సూచించారు. ఈ సందర్భంగా క్రీడల అధికారి బొల్లి గోపాలరావు మాట్లాడుతూ నూతనంగా క్రీడా పాఠశాలలో చేరే విద్యార్థులకు 9 అంశాలలో బ్యాటరీ టెస్ట్ ట్రాన్స్పరెంట్ గా నిర్వహించామని అన్నారు.రాష్ట్ర జాతీయ స్థాయిలో ఆడిన విద్యార్థులకు ఉపాధి ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉంటాయని స్పోర్ట్స్ ఆఫీసర్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఏటీడీఓ చంద్ర మోహన్, స్పెషల్ ఆఫీసర్ మధుకర్, క్రీడల అధికారి బొల్లి గోపాల్ రావు, సహాయ క్రీడల అధికారులు వెంకట నారాయణ, రాంబాబు, నాగేశ్వరరావు, పీడీ లు బాలసుబ్రహ్మణ్యం, నగేష్, అన్నం వేంకటేశ్వర్లు, రామారావు, రాంబాబు, యం.వేంకటేశ్వర్లు, బి.రాంబాబు, మోతీలాల్, పిఈటి లు అంజయ్య, మహేష్ బాబు, కె.వేంకటేశ్వర్లు, కృష్ణారావు, ఈ.అశోక్, జి.రవి, వీరభద్రం, బి.రవి, బయమ్మా, కోచ్ లు నాగరాజు, మారెప్ప, ప్రసాద్, వాసు, కిన్నెరసాని క్రీడా పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు, వార్డెన్ బట్టు శంకర్ ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు









## ప్రశాంతంగా జరుగుతున్న పదో తరగతి పరీక్షలు

- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- 10వ తరగతి పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్









**ఖమ్మం నగరం, నవభూమి, మార్చి 26:** జిల్లాలో పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. బుధవారం జిల్లా కలెక్టర్, రిక్కా బజార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పరీక్షా సెంటర్ ను తనిఖీ చేసి, పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ జిల్లాలో 10వ తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామని అన్నారు. ఎండ తీవ్రత దృష్ట్యా విద్యార్థులకు చల్లని త్రాగు నీరు సరఫరా చేయాలని, పరీక్ష కేంద్రానికి వచ్చే ప్రతి విద్యార్థినీ క్షుణ్ణంగా తనిఖీ చేసి లోపలికి అనుమతించాలని తెలిపారు. ఈ సందర్భంగా జరుగుతున్న పరీక్ష వివరాలు అడిగి తెలుసుకున్నారు.

రిక్కా బజార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం జరుగుతున్న మ్యాథ్స్ పరీక్షకు 250 మంది విద్యార్దులను కేటాయించగా, 100 శాతం విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని, పరీక్షా కేంద్రాల్లో విద్యార్దులను చెక్ చేసి లోపలికి అనుమతిస్తున్నట్లు అధికారులు కలెక్టర్ కు వివరించారు. జిల్లా కలెక్టర్ పరీక్షా కేంద్రం తనిఖీ సమయంలో చీఫ్ సూపరింటెండెంట్ కె. శేఖర్ రావు, డిపార్ట్మెంట్ అధికారి ఎన్. శ్రీనివాస చారీ, సిట్టింగ్ స్క్వాడ్ సురేందర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఎంపిహెచ్ఏ (ఎం) సిహెచ్. శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

# బిజెపి నాయకులు సతీష్ కుటుంబానికి కోనేరు పరామర్శ



**జూలురుపాడు,మార్చి 26 (నవభూమి ప్రతినిధి)-** మండల కేంద్రానికి చెందిన భారతీయ జనతా పార్టీ అనుబంధ కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు మాదినేని సతీష్ కుటుంబాన్ని బుధవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు కోనేరు చిన్ని దంపతులు సందర్శించారు.ఇటీవల సతీష్ తల్లి హైమావతి కి ప్రమాదవశాత్తు కాలికి గాయమై చికిత్స పొందుతున్నారు.విషయం తెలుసుకున్న చిన్ని దంపతులు జూలురుపాడులోని స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్న వారి తల్లిని పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. వీరితో పాటు బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి చిలుకూరు రమేష్ వున్నారు

# బిజెపి జిల్లా అధ్యక్షులు బైరెడ్డిని అభినందించిన అన్నవరపు



**జూలురుపాడు,మార్చి 26 (నవభూమి ప్రతినిధి)-** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భారతీయ జనతా పార్టీ అధ్యక్షులుగా నూతనంగా ఎన్నికైన బైరెడ్డి ప్రభాకర్ రెడ్డిని మండల పరిధిలోని పడమట నర్సాపురం గ్రామానికి చెందిన బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకులు అన్నవరపు సత్యనారాయణ బుధ వారం కొత్తగూడెంలో జిల్లా పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వారికి శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. నూతనంగా జిల్లా పార్టీ అధ్యక్షులు గా ఎన్నికైనందుకు సంతోషం వ్యక్తం చేస్తూ మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బైరెడ్డి తో రాజకీయ పయనం సుదీర్ఘమైనదని ఇద్దరం కలిసి పార్టీ అభివృద్ధి కోసం అనేక కార్య క్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. గత కాలపు మధుర జ్ఞాపకాలను కార్య కర్తలతో పంచుకున్నారు. రాబోయే రోజులలో తెలంగాణలో బి జె పి పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని బైరెడ్డి కృషి తో జిల్లాలో సైతం పార్టీ విస్తృతంగా అభివృద్ధి జరుగు తుందని తెలిపారు.భవిష్యత్తులో బైరెడ్డి మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు.

# ముస్లిం మత పెద్దలకు రంజాన్ తోఫా అందించిన తాసిల్దార్



**ఎర్రుపాలెం,నవభూమి,మార్చి 26:** రంజాన్ పండుగ సందర్భంగా మండల పరిధిలోని12 మసీదుల ముస్లిం మత పెద్దలకు రంజాన్ తోఫా నగదు 50 వేల రూపాయలను తాసిల్దార్ కార్యాలయం లోతహసిల్దార్ మన్నె ఉషా శారద బుధవారం అందించారు.ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.ఈ నెల 29వ తేదీ శనివారం సాయంత్రం ఎర్రుపాలెం మసీదులో ఇఫ్తార్ విందును ఏర్పాటుచేయనున్నట్లు ముస్లిం మత పెద్దలు తెలిపారు.కార్యక్రమంలో షేక్ ఇస్మాయిల్,టెంట్ మాబు,షేక్ సలాం,షేక్ రిజ్వాన్,మస్తాన్ వలి,శంషు,ఇమాంసా, షఫీ,జానీ,బాబా తదితరులున్నారు

# 28న పెద్దమ్మ గుడిలో రుద్రహోమం

**పాల్వంచ టౌన్ మార్చి 26 నవభూమి ప్రతినిధి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం కేశవాపురం జగన్నాధపురం గ్రామంలో వెలిసియున్న శ్రీ కనకదుర్గ దేవస్థానం( పెద్దమ్మ గుడి)లో శుక్రవారం మాస శివరాత్రిని పురస్కరించుకొని రుద్ర హోమం ఉదయం 9:00 9 గంటల నుండి మధ్యాహ్నం 1:00 గంటల వరకు స్వామివారి కళ్యాణం ఆలయ ఆవరణలో యాగశాలలో అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఈ హోమంలో పాల్గొనే భక్తులు ముందుగా అదే రోజు గానీ రూ1,516 లను చెల్లించి గోత్ర నామములు నమోదు చేసుకుని హోమంలో పాల్గొనాలని అన్నారు. పాల్గొన్న దంపతులకు శేష వస్త్ర ప్రసాదము లు అందజేయనున్నారు. ప్రత్యేకంగా పాల్గొనలేని భక్తుల పేర సంకల్పం చేసి హోమం నిర్వహించనున్నారు. పూర్తి వివరాలకు ఫోన్ నెంబర్ 6303408458 వారిని సంప్రదించగలరని దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎన్. రజనీకుమారి



**పెద్దమ్మ గుడిలో టెండర్- కం- బహిరంగ వేలములు**

శ్రీ కనకదుర్గ దేవస్థానం ( పెద్దమ్మ గుడి ) లో ఈనెల 28న శుక్రవారం ఉదయం11:00 గంటల నుండి అమ్మవారికి చెందిన కొత్త కాంప్లెక్స్ లోని షాప్ నెంబర్ -4,షాప్ నెంబర్ -10, ఏసీ(2) ఫంక్షన్ హాల్స్ ను, మూడు (3) సంవత్సరాల కాల పరిమితికి లీజు/ లైసెన్స్ హక్కు పొందడానికి, దేవస్థానం తరఫున ప్రోగు చేసిన చీరల అమ్మకం, పాత కాంప్లెక్స్ లోని షాప్ నెంబర్ -1, బొమ్మలు, బల్లాలు,ఇతర వస్తువుల అమ్మకాలకు ఫీల్డ్ టెండర్- కం- బహిరంగ వేలం నిర్వహించనున్నారు. తగిన రుసుము చెల్లించి షెడ్యూల్ ఉండాలని ధర వత్తు డి.డి జతపరచి టెండర్ వేసి ఈ క్రింది విధంగా బహిరంగ వేలం పాటలో పాల్గొన్నారు.

1) కొత్త కాంప్లెక్స్ లోని షాప్ నెంబర్ -1,2,4( ఒక్కంటికి ) రూ.50,000 లు,
2) ఏసీ ఫంక్షన్ హాల్స్ లేదు హక్కు ( హాల్ ఒక్కంటికి ) రూ.5,00,000లు
3) పాత కాంప్లెక్స్ లోని షాప్ నెంబర్ -1 లోని బొమ్మలు, బల్లాలు ఇతర వస్తువులు రూ. 20,000 లు, 4) దేవస్థానం తరఫున ప్రోగు చేసిన చీరల అమ్మకం రూ.20,000 లు, టెండర్ కం వేలంపాటలో పాల్గొనాలని దేవస్థాన కార్య నిర్వాహణాధికారి ఎ న్. రజనీకుమారి తెలిపారు.

# శిథిలాల కింద గాయపడిన, చనిపోయిన వారికి తగు న్యాయం చేయాలి

## ■ సిపిఎం నాయకులు నర్సారెడ్డి

**భద్రాచలం మార్చి 26 నవభూమి ప్రతినిధి:** భద్రాచలం పట్టణం నందు గల సలీం టీ స్టాల్ ఎదురు రోడ్డు నందు నూతనంగా నిర్మిస్తున్న ఆరంతస్తుల భవనం కుప్పకూలి ఆరుగురు కార్మికులు భవన శిథిలాల కింద చిక్కుకున్నారు. ఈ సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ రోహిత్ రాజ్ కూలిన భవనం దగ్గరకు వచ్చి పరిశీలించిన సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు యంబి నర్సారెడ్డి కలెక్టర్ తో మాట్లాడుతూ తక్షణమే మీరు భవన శిథిలాల కింద చిక్కుకున్న కార్మికులను రక్షించాలని, వారిని వెంటనే తరలించి చికిత్స అందించాలని, ఒకవేళ చనిపోతే ఆ కుటుంబాలకు తగిన న్యాయం చేయాలని, ముందు వారిని బయటికి తీయటానికి సరైన ప్రికాషన్స్ చేపట్టాలని వారిని అడగటం జరిగినది ఇప్పటికైనా ఇటువంటి భవనాలు నిర్మించేటప్పుడు సంబంధించిన అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వాటి పర్మిషన్లు సక్రమంగా ఉన్నాయా లేదా అని తెలుసుకొని అవి ఇంజనీరింగ్ ప్లాన్ ప్రకారం నిర్మితమవుతున్నాయా లేదా అని పరిశీలించి పరిమిషన్స్ ఇవ్వాలని డిమాండ్ చేసినారు. పాత భవనం 9 అంగుళాల పిల్లర్లతో ఉన్నటువంటి భవనం మీద ఎటువంటి పర్మిషన్లు



తీసుకోకుండా ఆరంతస్తులు నిర్మించడం వలన ఈ రోజు ఇటువంటి అనర్థాలు జరిగాయని దీనికి నైతికంగా ఎవరు బాధ్యత వహిస్తారు. ఆ కుటుంబాలకు ఏమి న్యాయం చేస్తారని ఈ సందర్భంగా ప్రశ్నించారు భవిష్యత్తులో అయినా ఇటువంటి సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకొని కార్మికుల ప్రాణాలు కాపాడాలని కోరినారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు గద్దం స్వామి, బండారు శరత్ బాబు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు

# మండలంలో పరీక్ష కేంద్రాలను పరిశీలించిన సీఈఓ





**ఎర్రుపాలెం, నవభూమి, మార్చి 26 :** ఖమ్మం జిల్లా పరిషత్ సీఈవో దీక్ష రైనా బుధవారం ఎర్రుపాలెం మండలంలో విస్తృతంగా పర్యటించారు.ఉదయం 11:30 గంటలకు ఉన్నత పాఠశాలలోని పదవతరగతి పరీక్షకేంద్రమును, గురుకుల పాఠశాలలోని పరీక్షా కేంద్రాలను సందర్శించారు. సీఈఓకి ఎంపీడీవో బి సురేందర్ ఎంఈఓ బి మురళీమోహన్ రావు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు.పరీక్ష కేంద్రాలను క్షుణ్ణంగా పరిశీలించి,అక్కడ ఉన్న వైద్య సిబ్బందిని విద్యార్థులకు అందిస్తున్న మందుల వివరాలుగురించి అడిగితెలుసుకున్నారు. అనంతరం పిఎస్ ఎర్రుపాలెం పాఠశాలను సందర్శించి విద్యార్థులకు పెడుతున్న మధ్యాహ్న భోజనంను పరిశీలించారు. ఎండిఎం మెను వివరాలు అడిగితెలుసు కొని విద్యార్థులతో ముచ్చటించారు. విద్యార్థులను ప్రశ్నించి సమాధానం రాబట్టారు.అనంతరం ఎర్రుపాలెంలోని అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులతో మాట్లాడారు.అంగన్వాడీ సిబ్బంది వారికి స్వాగతం పలికారు. అంగన్వాడీ కేంద్రంలో విద్యార్థులు రైమ్స్ పాడి వినిపించారు.ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి అబ్దుల్ హలీం,ఐసిడిఎస్ ఏసిడిపిఓ కృష్ణ శ్రీ, సూపర్వైజర్ సరిత,సిబ్బంది పాల్గొన్నారు

## ఎమ్మార్పీఎస్ మండల కమిటీ అధ్యక్షుడుగా శ్రీనివాస రావు



గార్ల, నవభూమి, మార్చి 26: ఎమ్మార్పీఎస్ గార్ల మండల కమిటీ అధ్యక్షుడుగా గార్ల కు చెందిన దూడపంగు శ్రీనివాస రావు మాదిగ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గార్ల లో బుధవారం జరిగిన సమావేశంలో శ్రీనివాస రావు తో పాటు ఉపాధ్యక్షుడుగా ఇరుగు వినోద్ కుమార్, ప్రధాన కార్యదర్శి గా తిప్పారపు హనుమంతరావు, అధికార ప్రతినిధి గా చీమకుర్తి రవీందర్, కోశాధికారి గా ఇమ్మడి వెంకన్న, ఆర్గనైజర్ గా జయరాజ్ లతో పాటు మరో పదిమంది కార్య వర్గ సభ్యులు ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మహబూబాబాద్ జిల్లా ఇన్చార్జి గుగ్గిళ్ళ పేరయ్య, గంటా శ్రీనివాస్,పాల్గొన్నారు

## రాజీవ్ యువ వికాస పథకంలో ప్రాధాన్యతనివ్వాలి



గార్ల, నవభూమి, మార్చి 26: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాస పథకంలో తెలంగాణ మలిదశ ఉద్యమకారులకు మొదట ప్రాధాన్యతనివ్వాలని తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం ఇల్లందు నియోజకవర్గ కన్వీనర్ కోమరాజు జగదీష్ బుధవారం రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మలిదశ ఉద్యమకారులు ఉద్యమ సమయంలో పోలీస్ లాఠీలు, తూటాలకు ముందుండి పోరాటం చెయడం తో పాటు జైలు జీవితాలు గడపడం, కోర్టుల చుట్టూ తిరుగుతూ ఆర్థికం మానసికంగా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. గత పదేళ్లుగా ఉద్యమకారులను బి ఆర్ ఎస్ పార్టీ ప్రభుత్వం ఏలాంటి గుర్తింపు ఇవ్వలేదని, ప్రస్తుత కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఉద్యమకారుల పోరాటాల గుర్తింపునిచ్చి రాజీవ్ యువ వికాస పథకంలో ప్రాధాన్యతనిచ్చి 90 శాతం సబ్సిడీ కల్పించాలని జగదీష్ కోరారు.

## ఆశీర్వాదం పార్థివ దేహానికి నివాళు లర్పించిన, మాల మహానాడు జిల్లా అధ్యక్షులు పూల రవీందర్




రుద్రంపూర్ మార్చి 26 నవభూమి: రామవరం మాల మహానాడు సీనియర్ నాయకులు అల్లకొండ మోహన్ కోడలు, అలకొండ గోపి సతీమణి అయిన అల్లకొండ లక్ష్మి, రుద్రంపూర్ మాలమహానాడు నాయకులు బుడిపుడి రవి తండ్రి అయిన బుడిపూడి ఆశీర్వాదం గార్లు అనారోగ్య కారణాలతో అకాల మరణం చెందినారు. రామవరం లోని వారి నివాసగృహంలో లక్ష్మి గారి పార్థివదేహానికి మరియు రుద్రంపూర్ లోని ఆశీర్వాదం పార్థివ దేహానికి పూలమాల వేసి వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మాల మహానాడు అధ్యక్షులు పూల రవీందర్, కొత్తగూడెం నియోజకవర్గ అధ్యక్షులు పగిడిపల్లి శ్రీకాంత్, మహిళా జిల్లా ఉపాధ్యక్షురాలు గంధం కల్పన, రామవరం మాలమహానాడు నాయకులు ఇళ్ల ఆదినారాయణ, పి. ఎన్. మూర్తి, ఈశ్వరయ్య, సోమరాజు, వాసు, రామస్వామి, సారిక శివ తదితర కుల సంఘ నాయకులు పాల్గొన్నారు

# పట్టుబడిన గొలుసు దొంగలు

- రెండు బంగారు గొలుసుల స్వాధీనం
- ఏసిపి రఘు





కల్లూరు, నవభూమి, మార్చి 26: కల్లూరు, సత్తుపల్లి మండలాలలో వివిధ ప్రదేశాలలో మహిళల మెడలో నుంచి గొలుసులు లాక్కొని దొంగతనానికి పాల్పడుతున్న నిందితుడిని అదుపులోకి తీసుకొని, చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు కల్లూరు ఏసిపి రఘు తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్ లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఏసీపీ మాట్లాడుతూ వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి... ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, ఏలూరు జిల్లా చింతలపూడి మండలం, రామవరం గ్రామానికి చెందిన మూడు రమేష్, మూడు గణేష్, సమీప గ్రామమైన వెంకటాద్రి గూడెంకి చెందిన కిరణ్ అనే ముగ్గురు స్నేహితులు, చెడు వ్యసనాలకు బానిసై, వ్యవసాయ కూలీ ద్వారా వచ్చే డబ్బు సరిపోక, జల్సాలకు అలవాటు పడి సులభంగా డబ్బు సంపాదించాలని అత్యాశతో దొంగతనాలకు పాల్పడుతున్నారు. గత సంవత్సరం జూన్ మూడో తారీఖున రాత్రి కల్లూరులోని కప్పల బంధం రోడ్డులో నివాసముంటున్న కోటి కన్యాదానం నరసింహాచార్యులు ఇంటికి జోస్యం చెప్పాలంటూ వెళ్లి సుమారు 25 గ్రాముల బరువు గల బంగారు గొలుసులు ఆయన మెడలో నుంచి లాక్కొని రమేష్, గణేష్ లు ఉడాయించారు. ఇదే సంవత్సరం సెప్టెంబర్ నెలలో మధ్యాహ్నా సమయంలో, సత్తుపల్లి మండలం కిష్టారం వై జంక్షన్ వద్ద మోపెడ్ పై వెళుతున్న భార్యాభర్తలను అనుసరించి, మహిళ మెడలో 25 గ్రాములు బంగారు గొలుసును లాక్కొని వెళ్లారు. ఇదే సంవత్సరం నవంబర్ నెలలో సత్తుపల్లి మండలం యాతర కుంట గ్రామంలో వరండాలో నిద్రిస్తున్న మహిళ మెడలో నుంచి ఐదు గ్రాముల బరువు గల బంగారం గొలుసు లాక్కుని వెళ్లారు. గత కొద్ది రోజుల క్రితం 17వ తారీఖున కల్లూరు మండలం కొర్లగూడెం గ్రామంలో, సాయంకాలం తమ ఇంటిదగ్గర మహిళ పశువుల పేడ తీస్తుండగా రమేష్, గణేష్ లు మోటార్ సైకిల్ పై వచ్చి 20 గ్రాముల బంగారు గొలుసు లాక్కొని ఉడాయించారు. ఈ వ్యక్తులలో రమేష్ గత కొద్ది రోజుల క్రితం దొంగిలించిన బంగారాన్ని సొమ్ము చేసుకునేందుకు, దొంగతనాలకు రెక్కీ నిర్వహించడానికి, కల్లూరులోని కప్పల బంధం రోడ్డులో అనుమానాస్పదంగా సంచరిస్తూ ఉండడంతో, అనుమానం వచ్చి ఆరాతీగా పట్టుబడినట్లు తెలిపారు. అతని వద్ద కల్లూరులో జరిగిన రెండు దొంగతనాలకు సంబంధించిన గొలుసులను, రూ .30 వేల నగదు స్వాధీనం చేసుకున్నామని, మిగిలిన వ్యక్తుల కోసం గాయంపు చర్యలు చేపట్టినట్లు ఏసిపి వివరించారు. పట్టుబడిన రమేష్ ను సత్తుపల్లి కోర్టు నందు హాజరు పరుస్తామని తెలిపారు. సి సి ఎస్ ఖమ్మం వారి సహకారంతో, గొలుసు దొంగలను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన, సత్తుపల్లి రూరల్ సీఐ ముత్తి లింగయ్య, కల్లూరు ఎస్సై డి.హరితను, పోలీస్ సిబ్బందిని ఏసిపి అభినందించారు. అపరిచితుల పట్ల మహిళలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

# పేద ముస్లిం కుటుంబాలను సంతోషంగా ఉంచేందుకే తోఫా పంపిణి

- పేదల ఆకలిని గుర్తిస్తున్న టిఎన్ఆర్ ట్రస్టు, ఖాజీమ్ అలి అభినందనీయులు
- సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా
- 225 పేద ముస్లిం కుటుంబాలకు తోఫా పంపిణి




కొత్తగూడెం మార్చి 26 నవభూమి ప్రతినిధి: రంజాన్ పండుగను సంతోషంగా జరుపుకునేందుకే పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ పండుగ తోఫాను అందిస్తున్నామని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె.సాబీర్ పాషా, ముస్లిం మైనార్టీ రాష్ట్ర నాయకులు నయిం ఖురేషి అన్నారు. సుజాతనగర్ మండలంలో పరిధిలో 150 మంది, చుంచుపల్లి మండలం వుమ్మడి పెనగడప జీపీలోని 75 మంది పేద ముస్లీంలను గుర్తించి వారికి పండుగకు అవసరమయ్యే తోఫాను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాల్లో వారు మాట్లాడుతూ పేదల ఆకలిని గుర్తించి టీఎన్ఆర్ ట్రస్టు చైర్మన్ తాండ్ర వెంకటేశ్వరరావు, ఆయన స్నేహితులు ఖాజీమ్ అలిలు తోఫా పంపిణీకి తమ సహకారాన్ని అందించారని తెలిపారు. ప్రజా స్వామ్య భారతదేశంలో ప్రతి ఒక్క రు కులమతాలకతీతంగా అన్ని పండుగలను జరుపుకొని ఆదర్శంగా నిలవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం తోఫాలతో సరిపెట్టుకోకుండా ముస్లీం పేద కుటుంబాలకు అన్ని విధాలా ఆదుకోవాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయడంతోపాటు నిరుద్యోగ యువతకు శాశ్వత ఉపాధి కల్పించాలని కోరారు. ప్రస్తుతం దేశాన్ని పాలిస్తున్న పాలకులు కులాలు, మతాల పేరుతో ప్రజల మధ్య చిచ్చుపెడుతూ రాజకీయ పబ్బంగడుపుకునేందుకు కుట్ర చేస్తున్నారని, ఈ కుట్రలను ప్రజలు గమనించి వారి కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నరాటి ప్రసాద్, టీఎన్ఆర్ భాద్యులు తాండ్ర బుచ్చిబాబు, కోదుమూరి పుల్లారావు, సీపీఐ జిల్లా సమితి సభ్యులు భూక్యా దస్రు, కొమారి హనుమంత రావు, జక్కుల రాములు, తాళ్ల వెంకటేశ్వ రావు, హనీఫ్, అల్లాహ బక్షా, కృష్ణ, నీదాల సుధాకర్, తాజుద్దిన్, మన్నే సంబశివరావు, బద్దరావు, ఉదయ్, భాస్కర్, రవి, శ్రీను, ఖాసీం ఖాన్, రహీమ్ జానీ, జయచందర్ తదితరులు పాల్గొన్నారు.



## భవనానికి అనుమతులు మంజూరు చేసిన అధికారులపై చర్యలు చేపట్టాలి

### బిఆర్ఎస్ పార్టీ నాయకులు డిమాండ్



**భద్రాచలం మార్చి 26 నవభూమి ప్రతినిధి:** భద్రాచలం పట్టణం బోనాల వారి వీధిలో ఆరు అంతస్తుల భవనం కూలిన ఘటనలో చిక్కుకున్న కార్మికులను యుద్ధ ప్రాతిపదిక అధికారులు కాపాడాలని. అట్టి భవనానికి అనుమతులు మంజూరు చేసిన అధికారులపై చర్యలు చేపట్టాలని బిఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ ఆకోజు సునీల్ కుమార్ కోరారు. నిరుపేద కుటుంబాలకు చెందిన కార్మిక వర్గం జీవనం కోసం పనికి వెళ్తే ఇలా జరగటం బాధాకరమని. దాదాపు పది నెలలుగా భవన నిర్మాణం జరుగుతున్న అధికారులు నోటీసులు ఇచ్చిన భవన యజమాని శ్రీపతి శ్రీనివాస్ గుట్టు చప్పుడు కాకుండా నిర్మాణ పనులు చేస్తున్నారని అధికారులు కూడా పనులు ఆపివేయడంలో విఫలమయ్యారని అన్నారు. యుద్ధ ప్రాతిపదిక అధికారులు చర్యలు చేపట్టి కార్మిక కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు

## ప్రపంచ సుందరి పోటీలను రద్దు చేయాలి




**గార్ల, నవభూమి, మార్చి 26:** హైదరాబాద్ లో నిర్వహించ తలపెట్టిన ప్రపంచ సుందరి పోటీలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ పి ఓ డబ్ల్యూ ఆధ్వర్యంలో బుధవారం మహిళలు గార్ల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ధర్నా నుద్దేశించి పి ఓ డబ్ల్యూ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి ఊకె పద్మ మాట్లాడుతూ దేశంలో అనేక సమస్యలతో మహిళలు ఇబ్బందులు పడుతుంటే పట్టించుకోకుండా ప్రభుత్వం అందాల పోటీలు నిర్వహించడం శోచనీయమన్నారు. ఈ పోటీలను రద్దు చెయకుంటే పి ఓ డబ్ల్యూ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆమె అన్నారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం ఇన్చార్జి కి వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకురాళ్ళు అనురాధ, జడ ఐలమ్మ, లక్ష్మి, సోమక్క, సుజాత, సైదమ్మ, పిచ్చమ్మ, మౌలిక, జ్యోతి తదితరులు పాల్గొన్నారు

## జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి

**సంగారెడ్డి బ్యూరో నవభూమి:** విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న ఒకరిని విధుల నుండి తొలగిస్తూ, మరో ఇద్దరు వైద్యాధికారులకు షోకాస్ నోటీసులుఅందించాలని, జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి , జిల్లా వైద్యధికారిణి ని ఆదేశించారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ అక్కడ విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన డాక్టర్లకు షోకాజు నటీసులు జారి.. అనంతరం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో బుధవారం వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో జిల్లాలో మాతా శిశు మరణాలు, మహిళా శిశు సంక్షేమ కార్యక్రమాలపై కలెక్టర్ వల్లూరు క్రాంతి సమీక్ష నిర్వహించారు.

## జర్నలిస్టుల ఇల్లు స్థలాల కోసం సంఘీభావం తెలిపిన ముదిరాజ్ సంఘం నాయకులు

**రుద్రంపూర్ మార్చి 26 నవభూమి:** డీఎంఎఫ్ నిధులు చెల్లించి భూమి కొనుగోలు చేసి ఇవ్వొచ్చు, జర్నలిస్టుల నిరసన దీక్షలో పాల్గొన్న అమరుల కుటుంబాలు, ఏడవ రోజుకు చేరుకున్న నిరసన కార్యక్రమానికి తెలంగాణ మన ముదిరాజ్ మహాసభ సంఘీభావం తెలియజేసింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం జర్నలిస్టులు తమ ఇండ్ల సాధన కోసం చేస్తున్న నిరసన న్యాయమైనదని సొప్పరి క్రాంతి ముదిరాజ్, బండారి సాగర్ ముదిరాజ్ అన్నారు. కోడి కుయ్యక ముందే సమాజాన్ని మేల్కొల్పి, ఎక్కడ ఏ సంఘటన జరిగిన తక్షణమే వార్త ప్రపంచానికి చాటిచెప్పే జర్నలిస్టులు దశాబ్ద కాలంగా ఇండ్ల స్థలం కోసం ఎదురుచూస్తున్నారని, తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కోసం విలేకరులు చేసిన కృషి మరువ లేనిది వారి కోరికను వెంటనే తీర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం జరిగింది, నిరసన కార్యక్రమానికి సంఘీభావం తెలిపి మద్దతు ప్రకటించి మాట్లాడారు. రాజకీయ నాయకులు ప్రతిపక్షంలో వున్నప్పుడు జర్నలిస్టులకు ఆనేక హామీలు ఇచ్చి గద్దెనెక్కిన తర్వాత హామీలను విస్మరించడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. డిఎంఎఫ్ నిధులతో పట్టణంలో రోడ్డు మీదే రోడ్డు వేస్తూ నిధులను దుర్వినియోగం చేస్తున్నారని, ఆ నిధులతో జర్నలిస్టు లకు ప్రభుత్వం కేటాయించిన ఇండ్ల స్థలాలకు



మానవత్వంతో నగదు చెల్లించి కొనుగోలు చేసి ఇవ్వవొచ్చని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం జర్నలిస్టు ల న్యాయమైన డిమాండ్ ను తీర్చాలన్నారు, వెంటనే ప్రభుత్వం స్పందించాలని కోరారు లేనిపక్షంలో యావత్ ముదిరాజ్ లోకం విలేకరుల పక్షాన ఉండి పోరాడుతారు అని తెలియజేశారు, ఈ యొక్క కార్యక్రమంలో ముదిరాజ్ నాయకులు, ముత్యాల రాజేష్ ముదిరాజ్, బుర్ర సతీష్ ముదిరాజ్, కొల హరీష్ ముదిరాజ్, దద్దగూటి కిరణ్ ముదిరాజ్ తదితరులు పాల్గొని సంఘీభావం తెలిపారు

## 28 నుంచి కొండలమ్మ జాతర



**గార్ల, నవభూమి, మార్చి 26:** కాకతీయ రాజుల ఇలవేల్పుగా వాసికెక్కిన గార్ల మండలం పినిరెడ్డిగూడెం సమీపంలోని కొండలమ్మ జాతర ఈనెల 28 నుంచి నుంచి 31వ తేదీ వరకు వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ అన్ని సన్నాహాలు పూర్తి చేశారు. కాకతీయ రాజుల్లో ఒకరైన ప్రతాపరుద్రుడు ఎంతో సర్వాంగ సుందరంగా శిల్పకళా నైపుణ్యంతో కొండలమ్మ దేవాలయ నిర్మాణం గావించారు. దేవాలయ సమీపంలోని చెరువును సహితం తవ్వించి ప్రజలకు తాగు, సాగు నీరు అందించే విధంగా ఏర్పాటు చేశారు. కాకతీయ రాజులు శివభక్తులైన తమ ఆరాధ్య దేవత కొండలమ్మనే కొలిచే వారు. నాడు ఉగాది పర్వదినం నుంచి వారం రోజుల పాటు అంగరంగ వైభవంగా కొండలమ్మ జాతర నిర్వహించేవారు.కాలానుగుణంగా దేవాలయ బాగోగులు పట్టించుకునేవారు కరువయ్యారు. దీంతో దేవాలయం శిథిలావస్థకు చేరుకోవటం పిచ్చిమొక్కలు, కంపచెట్లు పెరిగి అధ్వాన్న స్థితికి చేరుకుంది. కొందరు దాతలు ఇటీవల కాలంలో దేవాలయాలన్ని శుభ్ర పరచడం, భక్తులు



సేద తీర్చుకునేందుకు షెడ్ల నిర్మాణం చేయడం, ఆలయం వరకు రహదారి నిర్మాణం, తదితర అభివృద్ధి పనులను చేపట్టారు. ఉగాది పర్వదినం నుంచి నాలుగు రోజుల పాటు అంగరంగ వైభవంగా జాతర నిర్వహించేందుకు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈనెల 28 న ఎడ్లబండ్ల ప్రభలు, 29న పూర్ణకుంభంతో దేవతారాధన, 30న నైవేద్య సమర్పణ,31న భజన సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాటు గావించారు. కొండలమ్మ దేవాలయం లో ఒక ప్రత్యేక ఉంది. జాతర జరిగే నాలుగు రోజుల పాటు ఆలయం ప్రహారీ లపై పాములు సంచరిస్తూ ఉంటాయి. మొక్కులు తీర్చుకోవడానికి వచ్చే భక్తులకు ఏలాంటి హాని తలపెట్టిన దాఖలాలు ఇప్పటి వరకు లేవు. జాతర కు తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలనుండి భక్తులు తరలి వచ్చి దేవత దర్శించుకుంటారు

## కొత్తగూడెంకు ఎర్త్ సైన్సెస్ మంజూరు చేయాలని సీఎంకు తుమ్మల వినతి

- ఇప్పటికే పలుమార్లు వినతులు అందించిన మంత్రి తుమ్మల
- భవిష్యత్తులో జాతీయస్థాయి కార్యకలాపాలు
- విశ్వవిద్యాలయం ఏర్పాటుకు సీఎం రేవంత్ హామీ
- సీఎం సానుకూల స్పందన పట్ల తుమ్మల హర్షం

**కొత్తగూడెం మార్చి 26 నవభూమి ప్రతినిధి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని మైనింగ్ ఇంజనీరింగ్ కళాశాలను యూనివర్సిటీ ఆఫ్ ఎర్త్ సైన్సెస్ గా అప్ గ్రేడ్ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని రాష్ట్ర వ్యవసాయ శాఖ మాత్యులు తుమ్మల నాగేశ్వరరావు కోరారు. ఈ మేరకు అసెంబ్లీలోని సీఎం కార్యాలయంలో బుధవారం మంత్రి తుమ్మల కలిసి లేఖను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ సింగరేణి స్కూల్ ఆఫ్ మైన్స్ దేశంలోనే అత్యున్నత కళాశాల అని యూనివర్సిటీగా మారిస్తే అత్యంత ప్రయోజనం ఉంటుందన్నారు. దాదాపు 400 ఎకరాల విస్తీర్ణంలో కళాశాల ఉందని 800 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. మైనింగ్ కళాశాలను విశ్వవిద్యాలయంగా మారిస్తే వేలాదిమంది శాస్త్రవేత్తలను తయారు చేయవచ్చు అన్నారు. నాగరికతతో పాటు పెరుగుతున్న జనాభా అవసరాలు తీర్చడంలో సహజ వనరులు కీలక పాత్ర పోషిస్తాయని



పేర్కొన్నారు. విశ్వ విద్యాలయంగా రూపాంతరం చెందితే ఉపాధి అవకాశాలు మెరుగుపరచడంతో పాటు రాష్ట్రానికి దేశానికి ఖ్యాతిని తెచ్చిపెడుతుందన్నారు. ఎర్త్ సైన్సెస్ కు చెందిన వివిధ కోర్సులను అమలు చేస్తే పలు అంశాలలో జాతీయస్థాయిలో కార్యకలాపాలు విస్తరించే అవకాశం ఉందన్నారు. దీనికి స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యార్థుల భవిష్యత్తు పర్యావరణహితం కోసం, శాస్త్రవేత్తలను తయారు చేయడం కోసం యూనివర్సిటీగా మార్చేందుకు చర్యలు తీసుకుంటానని మంత్రి తుమ్మలకు హామీ ఇచ్చారు. దీంతో మంత్రి తుమ్మల సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఉపాధి ఉద్యోగం మైనింగ్ కళాశాలను యూనివర్సిటీగా మారిస్తే వేలాదిమంది విద్యార్థులు శాస్త్రవేత్తలు గాను పలువురికి ఉపాధి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. ఎర్త్ సైన్సెస్ వర్సిటీతో జియో కెమిస్ట్రీ, జియో ఫిజిక్స్, ప్లానెట్రీ జియాలజీ, జియో మేరపాలజీ, స్ట్రక్చర్ జియాలజీ, ఖనిజ శాస్త్రం, పర్యావరణ భూగర్భ శాస్త్రం వంటి విభిన్న కోర్సులు అందుబాటులోకి వస్తాయని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రస్థాయిలో ప్రవేశాలు కల్పించే వీలు ఉంటుందని రాష్ట్ర నలుమూలల నుంచి విద్యార్థులు చదువుతోపాటు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. భవిష్యత్తులో జాతీయస్థాయిలో కార్యకలాపాలు విస్తరించే అవకాశాలు అందిపుచ్చుకోవచ్చు అన్నారు

# డీలర్లు విధిగా ప్రభుత్వ నిబంధనలు పాటించాలి



**గార్ల, నవభూమి, మార్చి 26:** ఎరువు వ్యాపార డీలర్లు విధిగా ప్రభుత్వ నిబంధనలు పాటించాలని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని మహబూబాబాద్ జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఎం. విజయ నిర్మల డీలర్లను హెచ్చరించారు. మండల కేంద్రమైన గార్లలోని పలు ఎరువుల దుకాణాల్లో రిజిస్టర్లు, నిల్వ ఉన్న ఎరువులు, క్రిమిసంహారక మందులను బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులు, క్రిమిసంహారక మందుల రైతులకు విక్రయించడంతో పాటు రైతులు కొనుగోలు చేసిన వస్తువులకు బిల్లు అందించి రైతు సంతకం తీసుకోవాలని సూచించారు. స్టాక్ బోర్డు ఏర్పాటు చెయడం, గడువు దాటిన ఎరువులు, క్రిమిసంహారక విక్రయిస్తే ఉపేక్షించేది లేదని, రైతుల ఆధార్ కార్డు ల ద్వారా ఈ పాస్ మెషిన్ లో నమోదు చేసుకొని అమ్మకాలు జరపాలని సూచించారు. డీలర్ షాపు తనిఖీ లకు వచ్చే అధికారులకు పూర్తి సహకారం అందించాలని, నిర్లక్ష్యం వ్యవహరించడం, నిభందనలు ఉల్లంఘించినట్లు ఫిర్యాదు వస్తే షాపు లైసెన్స్ రద్దు చేస్తామని విజయ నిర్మల డీలర్లను హెచ్చరించారు. ఈ తనిఖీల్లో గార్ల మండల వ్యవసాయ శాఖాధికారి కె రామారావు, తదితరులు పాల్గొన్నారు

# గుండెపోటుతో సింగరేణి వెల్ఫేర్ అధికారి పాగోలు రాజు మృతి, మిత్రుల నివాళులు



**ఇల్లందు టౌన్ మార్చి 26 నవభూమి:** ఆర్‌జీ–2 ఓసీపీ–3లో వెల్ఫేర్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న ఇల్లందుకు చెందిన పాగోలు రాజు బుధవారం ఉదయం హఠాత్తుగా కార్డియాక్ అరెస్ట్‌కు గురై మృతి చెందారు. రాజు ఆకస్మిక మృతితో కుటుంబ సభ్యులు, సహచర ఉద్యోగులు, స్నేహితులు విషాదంలో మునిగిపోయారు.రాజు విద్యార్థి దశలోనే మంచి ఆలోచనలతో, మానవత్వంతో మెలిగేవారని ఆయన స్నేహితులు గుర్తుచేశారు. సింగరేణి హైస్కూల్‌లో చదువుకునే రోజుల్లోనే సహచరులకు ఆదర్శంగా నిలిచిన రాజు, ఉద్యోగ జీవితంలోనూ నిస్వార్థంగా సేవలందించారని మిత్రులు కొనియాడారు. రాజు మృతి పట్ల ఎండి. అక్బర్, జి. కుమార్, పురుషోత్తం, మజీద్, వెంకటేశ్వర్లు, కె.టి.విజయ్ కుమార్, సుధాకర్, కిరణ్, రమేష్, రవి తదితర ఆప్తమిత్రులు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ ఘటన రాజు కుటుంబాన్ని శోకసంద్రంలో ముంచేసింది. రాజు సేవాభావం, స్నేహపూర్వక స్వభావాన్ని గుర్తుచేసుకుంటూ స్నేహితులు, సహచరులు కన్నీటి నివాళులర్పించారు.

# అంబేద్కర్ విగ్రహావిష్కరణకు రండి

## స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు ఆహ్వానం

**చేవెళ్ల మార్చి 26 నవభూమి :** షాబాద్ మండలం చందన వెళ్ళి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల అసెంబ్లీ ఇంచార్జ్ మేన భీంభరత్, అంబేద్కర్ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సత్కరించారు. రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం చందనవెల్లి గ్రామంలో ఏర్పాటుచేసిన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహావిష్కరణకు ముఖ్యఅతిథిగా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ హాజరై పాల్గొనాలని చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జ్ పామేన భీంభరత్, అంబేద్కర్ కమిటీ నాయకులు ఆయనకు ఆహ్వానం పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా భీంభరత్ మాట్లాడుతూ..అంబేద్కర్ గొప్ప సంఘ సంస్కర్త, మరణం లేని మహనీయుడని, బాబా సాహెబ్ మన భావాల్లో ఎప్పుడూ బతికి ఉంటారని, అలాంటి గొప్ప మహనీయుని విగ్రహ ప్రతిస్థాపన గ్రామ గ్రామాన నెలకొల్పాలని అన్నారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ళ స్వామి , బాలకృష్ణ ,నరేష్ , ప్రవీణ్ ,మల్లేష్ , వెంకటేష్ , శ్రీహరి , వెంకటయ్య ,మల్లేష్ , శ్రీకాంత్ , కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల డిమాండ్ న్యాయమైనది

- డీఎంఎఫ్ నిధులు చెల్లించి భూమి కొనుగోలు చేసి ఇవ్వొచ్చు
- జర్నలిస్టుల నిరసన దీక్షలో పాల్గొన్న అమరుల కుటుంబాలు
- ఏడో రోజుకు చేరుకున్న నిరసన కార్యక్రమం

**కొత్తగూడెం మార్చి 26 నవభూమి ప్రతినిధి:** జర్నలిస్టులు తమ ఇండ్ల సాధన కోసం చేస్తున్న నిరసన న్యాయమైనదని సింగరేణి రిటైర్డ్ జీఎం ఎ. ఆనందరావు అన్నారు. కోడి కుయకముందే సమాజాన్ని మేల్కొలి, ఎక్కడ ఏ సంఘటన జరిగిన తక్షణమే వార్త ప్రపంచానికి చాటిచెప్పే జర్నలిస్టులు దశాబ్ద కాలంగా ఇండ్ల స్థలం కోసం ఎదురుచూస్తున్నారని వారి కోరికను వెంటనే తీర్చాలని ప్రభుత్వాన్ని కోరారు. సామాజిక వేత్త, యువ నాయకులు బండి విజయ భాస్కర్ నిరసన కార్యక్రమానికి సంఘీభావం తెలిపి మద్దతు ప్రకటించి మాట్లాడారు. రాజకీయ నాయకులు ప్రతిపక్షంలో వున్నప్పుడు జర్నలిస్టులకు ఆనేక హామీలు ఇచ్చి గద్దెనెక్కిన తర్వాత హామీలను విస్మరించడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. డిఎంఎఫ్ నిధులతో పట్టణంలో రోడ్డు మీదే రోడ్డు వేస్తూ నిధులను దుర్వినియోగం చేస్తున్నారని, ఆ నిధులతో జర్నలిస్టు లకు ప్రభుత్వం కేటాయించిన ఇండ్ల స్థలాలకు మానవత్వంతో నగదు చెల్లించి కొనుగోలు చేసి ఇవ్వవొచ్చని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం జర్నలిస్టు ల న్యాయమైన డిమాండ్ ను తేర్చాలన్నారు. పర్యావరణ ప్రేమికుడు మొక్కల రాజశేఖర్ నిరసన శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపి మాట్లాడారు. మొక్కల రాజశేఖర్ గా నన్ను ప్రపంచానికి పరిచయం చేసిందే మీడియా సోదరులని, అలాంటి మీడియా మిత్రులు తమ సమస్యల కోసం నిరసన చేపట్టడం ఎంతో బాధాకరమని అన్నారు. మీడియా వల్లే నాకు ప్రధాని మోడీ తో మాట్లాడే అవకాశం వచ్చిందని గుర్తు చేశారు. వెంటనే ప్రభుత్వం స్పందించాలని కోరారు. తెలంగాణ మన ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్య నిర్వహణ కార్యదర్శి సొప్పరి క్రాంతి , జిల్లా నాయకులు బండారి సాగర్, బుర్ర సతీష్, కొల హరీష్, ముత్యాల రాజేష్, దద్దగూటి కిరణ్, ఆచార్య మద్దెల శివ కుమార్ తదితరులు సంఘీభావం తెలిపారు. ఏడవ రోజు దీక్షలో జర్నలిజం వృత్తి చేస్తూ మరణించిన కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. వారు ప్రభుత్వానికి మాకు స్థలం ఇచ్చి మా కుటుంబాలను ఆదుకోవాలి వేడుకొన్నారు. ఈ సందర్భంగా తొలుత అమరులైన వారికి రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వివిధ పత్రికల, ఛానెళ్ల రిపోర్టర్లు పాల్గొన్నారు











# మహిళా మార్ట్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలి

- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- ఓపెన్ స్పేస్‌లో పార్కింగ్‌తో పాటు రిటైల్ బిజినెస్ ఏర్పాటు
- మహిళా మార్ట్ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్







**ఖమ్మం నవభూమి బ్యూరో, మార్చి 26:** మహిళా మార్ట్ ను ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ సీక్వెల్ రోడ్డులోని మహిళా మార్ట్ ఏర్పాటు చేయు భవనం వద్ద పనులను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ తో కలిసి పరిశీలించి, చేయవలసిన ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ మహిళా మార్ట్ ముందు భాగంలో ఉన్న ఓపెన్ స్పేస్ లో పార్కింగ్ సౌకర్యం కల్పించాలని, ఓపెన్ స్పేస్ లో టైల్స్ వేసి రిటైల్ బిజినెస్ క్రింద ఫుడ్, టీ స్టాల్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. మహిళా మార్ట్ వద్ద గ్లాస్ ఎంట్రీ ఏర్పాటు చేయాలని అన్నారు. మహిళా మార్ట్ నిర్వహణ కట్టుదిట్టంగా ఉండాలని, నీట్ గా మెయింటైన్ చేయాలని కలెక్టర్ తెలిపారు. మహిళా మార్ట్ లో స్వశక్తి మహిళా సంఘాల చే తయారుచేసిన పదార్థాలు విక్రయించడం జరుగుతుందని, ఉత్పత్తుల వివరాలు, తయారీ విధానం, అమ్మే మహిళ గ్రూప్ స్టోరీ నీ డాక్యుమెంట్ చేస్తూ ప్రదర్శించాలని అన్నారు. మహిళ మార్ట్ మొదటి అంతస్తులో ఉన్న రూం లను మార్కెట్ డిమాండ్ ప్రకారం ఉపయోగంలోకి తీసుకొని రావాలని అన్నారు. మహిళా మార్ట్ లో పెట్టే వస్తువుల స్టాక్ నిల్వలు పకడ్బందీగా భద్రపరిచేందుకు ఏర్పాట్లు ఉండాలని అన్నారు. మహిళా మార్ట్ లో పనిచేసే సిబ్బందికి లంచ్ రూమ్, ఇతర వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని అన్నారు. మహిళా మార్ట్ లో బిల్లింగ్ విధానం, స్టాకింగ్ తదితర అంశాలపై మహిళలకు శిక్షణ అందించాలని, డి- మార్ట్ విధానంలో ఇక్కడ బిల్లింగ్ వ్యవస్థ ఉండేలా చూడాలని కలెక్టర్ సూచించారు. మహిళా మార్ట్ వద్ద ఎల్.ఈ.డి లైటింగ్ వ్యవస్థ ఏర్పాటు చేయాలని అన్నారు. ఖమ్మం జిల్లా బ్రాండింగ్ వచ్చేలా లోగో, స్టిక్కరింగ్ డిజైన్ తయారు చేయాలని, ప్రైవేట్ షాపింగ్ మాల్స్ లో అనుసరిస్తున్న మోడల్ లను పరిశీలించి మహిళ మార్ట్ ప్రత్యేకతగా ఉండేలా తయారు చేయాలని, మహిళా మార్ట్ ను వ్యాపార దృక్పథంతో లాభాలు వచ్చే విధంగా నడపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ సన్యాసయ్య, అడిషనల్ డి.ఆర్డీఓ నూరోద్దీన్, పంచాయతీ రాజ్ ఈఈ వెంకట్ రెడ్డి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు

# ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్‌కు ప్రణాళికాబద్ధంగా చర్యలు

- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- మండల కేంద్రంలో మోడల్ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలి
- నిరుపేదలకు లక్ష రూపాయలు మహిళా సంఘాల ద్వారా రుణాలు అందించాలి
- వారం రోజులలో మంజూరైన ఇండ్ల మార్కింగ్ పూర్తి చేయాలి
- ఇందిరమ్మ ఇండ్లపై సంబంధిత అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్



**ఖమ్మం కలెక్టరేట్, మార్చి 26నవభూమి ప్రతినిధి :** మండలాల్లోని పైలట్ గ్రామాలలో మంజూరు చేసిన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్ కు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు.

బుధవారం జిల్లా కలెక్టర్, కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజతో కలిసి సంబంధిత అధికారులతో సమీక్షించారు. ప్రతి మండల కేంద్రంలో చేపట్టిన మోడల్ ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పురోగతి, పైలెట్ గ్రామాలలో గ్రౌండ్ చేసిన ఇందిరమ్మ ఇండ్ల స్థితిగతుల వివరాలపై కలెక్టర్ మండలాల వారిగా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, పైలెట్ గ్రామాల్లో ఎంపిక చేసిన 850 లబ్ధిదారులలో ఇంటి నిర్మాణానికి ముందు డబ్బులు పెట్టుకోలేని 369 మంది నిరుపేదలు ఉంటే మహిళా సంఘాల ద్వారా లక్ష రూపాయల రుణం అందించాలని నిర్ణయించామని అన్నారు. వారం రోజుల వ్యవధిలో వీరందరికీ రుణాలు అందించేలా జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారితో సమన్వయం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. మండల కేంద్రాలలో మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్ల మోడల్ హౌస్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని అన్నారు. ఆరు మండల కేంద్రాలలో పనులు పురోగతి చాలా నెమ్మదిగా ఉందని, సంబంధిత కాంట్రాక్టర్ తో అధికారులు మాట్లాడాలని, వచ్చే బుధవారం నాటికి ఇక్కడ పనులలో వేగం పెరిగి రెండు వారాలలో పనులు పూర్తి చేయలేని పక్షంలో సంబంధిత కాంట్రాక్ట రద్దు చేసి ఇతరులకు కేటాయించడం జరుగుతుందని అన్నారు. ప్రతి సోమవారం మండల కేంద్రంలో జరుగుతున్న మోడల్ హౌస్ నిర్మాణం పనుల వద్ద లబ్ధిదారులతో సమావేశం నిర్వహించి తక్కువ ఖర్చుతో మంచి ఇంటిని ఎలా నిర్మించుకోవాలో అవగాహన కల్పించాలని అన్నారు. ప్రతి లబ్ధిదారుడికి ఇంటి నిర్మాణం ముందు సంపూర్ణ అవగాహన అందేలా చూడాలని అన్నారు. ఇందిరమ్మ ఇళ్లు ప్రభుత్వానికి అత్యంత ప్రతిష్టాత్మమైన కార్యక్రమమని, ప్రారంభించిన ఇండ్లు ఎట్టి పరిస్థితుల్లో మధ్యలో ఆగిపోవడానికి వీలు లేదని, ప్రణాళిక ప్రకారం జాగ్రత్తగా మన జిల్లాకు మంజూరు చేసిన ఇంటి నిర్మాణ పనులు పూర్తయ్యే వరకు అప్రమత్తంగా ఉంటూ పర్యవేక్షించాలని అన్నారు. పంచాయతీ కార్యదర్శి గ్రామాలలో జరుగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, ప్రతి దశలో అధికారులు లబ్ధిదారులకు అవసరమైన సలహాలు, సూచనలు అందిస్తూ నాణ్యతతో కూడిన ఇంటి నిర్మాణం జరిగేలా చూడాలని అన్నారు. గ్రామాలలో ఒంటరి మహిళలకు ఎవరికైనా ఇందిరమ్మ ఇండ్లు మంజూరైతే ఇంటికి సంబంధిత ఎంపీడీవో, ఎంపీఓ లేదా పంచాయతీ కార్యదర్శి బాధ్యతలు తీసుకొని నిర్మాణ పనులు జరిగేలా చూడాలని అన్నారు. మిగిలిన లబ్దిదారులు ఇంటి నిర్మాణానికి మార్కింగ్ చేసుకొని త్వరగా నిర్మాణ పనులు ప్రారంభించేలా చూడాలని అన్నారు. జిల్లాలో మంజూరైన 850 ఇందిరమ్మ ఇండ్ల పనులు గ్రౌండ్ అయ్యేందుకు చర్యలు తీసుకోవాలని, వారం రోజులలో వీరంతా తప్పనిసరిగా మార్క్ ఔట్ జరిగేలా చూడాలని కలెక్టర్ స్పష్టమైన సూచనలు జారీ చేశారు. ఎల్ 1, ఎల్ 2 విభాగాలలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల పూర్తి వివరాలను అందించాలని అన్నారు. నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కావాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారిణి ఏ. పద్మశ్రీ, జెడ్పి సీఈవో దీక్ష రైనా, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సన్యాసయ్య, ఈఈ హౌసింగ్ భూక్యా శ్రీనివాస్, ఈఈ పంచాయతీ రాజ్ వెంకటరెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి ఆశా లత, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు









# ఆకాశవాణిలో బొమ్మనపల్లి విద్యార్థుల గళం



**కొత్తగూడెం మార్చి 26 నవభూమి ప్రతినిధి:** గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఆకాశవాణి కొత్తగూడెం కేంద్రంలో కదంబ కార్యక్రమాన్ని ఇచ్చి తమ ప్రతిభను చాటిచెప్పారు. బుధవారం బొమ్మనపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ఆకాశవాణి కొత్తగూడెం కేంద్రంలో తమ ప్రతిభ ను ప్రదర్శించే కార్యక్రమాన్ని ప్రదర్శించారు. పాటలు, గేయాలు, సామెతలు, కథలు, ఇంగ్లీష్ రైమ్స్, పొడుపు కథలు,నాటికల ప్రదర్శన ద్వారా విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. బొమ్మనపల్లి చరిత్రలోనే తొలిసారిగా విద్యార్థులు ఈ అత్యుత్తమ ప్రతిభను ఆకాశవాణిలో ద్వారా చాటిచెప్పారు. ఐదో తరగతి విద్యార్థిని డి. ఊహ అద్భుతంగా యాంకరింగ్ చేసింది. పాఠశాల హెచ్ఎం, ఎం.జ్యోతిరాణి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కదంబ కార్యక్రమంలో 23 మంది విద్యార్థులు పాల్గొని తమ గళాన్ని ఆకాశవాణి ద్వారా వినిపించారు. హెడ్మాస్టర్ ఎం.జ్యోతిరాణి కూడా భద్రాద్రి జిల్లాలో బాలమేళా పై ఆకాశవాణి లో సమీక్ష ప్రసంగం ఇచ్చారు.

# కొత్తగూడెం కార్పొరేషన్ సాధించిన ఎమ్మెల్యే కూనంనేని కృతజ్ఞతలు

## రాష్ట్ర మైనార్టీ నాయకులు నయీమ్ ఖురేషి



**కొత్తగూడెం మార్చి 26 నవభూమి ప్రతినిధి:** కొత్తగూడెం,పాల్వంచ మున్సిపాలిటీలతో పాటు సుజాతనగర్ మండల పరిధిలో ని ఏడు గ్రామపంచాయతీలు కలుపుతూ కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటు చేస్తూ సోమవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బిల్లుకు ఆమోదం లభించిన సందర్భంగా పట్టుబట్టి నియోజకవర్గాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయాలని సంకల్పంతోనే కార్పొరేషన్ ఏర్పాటుకు శక్తి వంచన లేకుండా కృషిచేసి కార్పొరేషన్ సాధించిన ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కు ప్రభుత్వానికి కొత్తగూడెం పాల్వంచ సుజాతనగర్ ముస్లిం మైనార్టీల తరుపున రాష్ట్ర మైనార్టీ నాయకులు నయీమ్ ఖురేషి కృతజ్ఞతలు తెలిపారు

# రామన్ గౌడ్‌ను పరామర్శించిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు పగిడాల శ్రీనివాస్

**వీపనగండ్ల, మార్చి 27 నవభూమి-**వీపనగండ్ల మండల పరిధిలోని తూముకుంట గ్రామం సింగిల్ విండో చైర్మన్ రామన్ గౌడ్ భార్య రాధమ్మ కొద్ది రోజుల క్రితం చనిపోవడం విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ సీనియర్ నాయకులు పగడాల శ్రీనివాస్, మాజీ జెడ్ పి టి సి మాధురి కిరణ్ గౌడ్ బుధవారం పరామర్శించారు.



# ముస్లిం ఐక్య సంఘం ఆధ్వర్యంలో పేద ముస్లింలకు రంజాన్ తోఫాలు

**ఎర్రుపాలెం,నవభూమి,మార్చి 26:** ఎర్రుపాలెం మండల ముస్లిం ఐక్య సంఘం ఆధ్వర్యంలో బుధవారం మీనవోలు గ్రామంలో 400 మంది పేద ముస్లింలకు రంజాన్ తోఫాల స్థానిక ఎస్సై పి వెంకటేష్ ఆధ్వర్యంలో ముస్లిం మత పెద్దలు అందించారు. ఈ కార్యక్రమానికి ఎస్సై ముఖ్యఅతిథిగా హాజరై ముస్లిం ఐక్య సంఘం యొక్క సేవా కార్యక్రమాలను కొని ఆడారు. పేదలను ఆదుకోవడానికి ప్రతి ఒక్కరూ ముందుకురావాలని ముస్లిం ఐక్యసంఘం చేస్తున్న కృషినికొనిఆడారు. ముందుగా ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సమావేశంలో ముస్లిం ఐక్య సంఘం సెంట్రల్ కమిటీ అధ్యక్షులు మౌలానా షేక్ ముజాహిద్, ఉపాధ్యక్షులు షేక్ హుస్సేన్,ప్రధాన కార్యదర్శి మహమ్మద్ గౌసుద్దీన్,ఎర్రు పాలెం ముస్లిం ఐక్య సంఘం మండల కమిటీ అధ్యక్షులు జనాబ్ షేక్ బాసిత్ అలీ,ప్రధాన కార్యదర్శి షేక్ మొహమ్మద్ రఫీ,కోశాధికారి షేక్ నాగుల్ మీరా,ఎర్రు పాలెంటౌన్ మజీద్ ప్రెసిడెంట్ షేక్ ఇస్మాయిల్,టెంట్ బాబు,ముస్లిం కమిటీ సభ్యులు,గ్రామ ముస్లిం సోదరులు,




సోదరీమణులు పాల్గొన్నారు.

## భట్టి విక్రమార్కకు స్వామివారి బ్రహ్మోత్సవాల ఆహ్వానం





**ఎర్రుపాలెం, నవభూమి, మార్చి 26 :** శ్రీరామనవమి సందర్భంగా జమలాపురం శ్రీ వెంకటేశ్వరస్వామి వారి ఆలయంలో జరగనున్న శ్రీవసంతనవరాత్రి బ్రహ్మోత్స వాల ఆహ్వానపత్రికను ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కు హైదరాబాదు లోని ప్రగతి భవనంలో,రాష్ట్ర దేవదాయ శాఖ కమిషనర్ కార్యాలయంలో కమిష నర్ శ్రీధర్ కు ఆలయ ఈవో కొత్తూరు జగన్మోహనరావు,ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాస్ శర్మ బుధవారం అందించారు.శ్రీ వెంకటేశ్వర స్వామివారి దేవస్థానం నందు ఈనెల 30 తేదీ నుండి ఏప్రియల్ 7 తేదీ వరకు జరిగే శ్రీవసంత నవరాత్రి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కు అందించి స్వామివారి చిత్రపటం, శేష వస్త్రములు,ప్రసాదము అందించి స్వామివారి బ్రహ్మోత్సవాలకు కుటుంబ సమేతంగా రావాలని ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో ఈవో కొత్తూరు జగన్మోహన్రావు,ప్రధాన అర్చకులు శ్రీనివాస్ శర్మ,వేద పండితులు సాయి అభిలాష్ శర్మ, వంశి పాల్గొన్నారు.

## ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేసిన అడిషనల్ కలెక్టర్



**కారేపల్లి,నవభూమి,మార్చి26 :** కారేపల్లి మండలం రేలకాయలపల్లి ఆశ్రమ పాఠశాలను అడిషనల్ కలెక్టర్ డాక్టర్ శ్రీజ బుధవారం తనిఖీ చేశారు. ఆశ్రమ పాఠశాలలో తరగతి గదులు, వంటశాల, డార్మెట్రీలను సందర్శించారు. విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల ధరించిన దుస్తులు, హెయిర్ కటింగ్, వ్యక్తిగత పరిశుభ్రతను ఆడిషనల్ కలెక్టర్ గమనించి అసంతృప్తి వ్యక్తం చేస్తూ ఉపాధ్యాయులు, హెచ్ఎం, వార్డెన్‌పై అగ్రహించారు. వసతి గృహంలో హై, లోవోల్టేజీ తో విద్యుత్ సరఫరాలో జరుగుతున్న అంతరాయంపై విద్యార్థులకు అడిషనల్ కలెక్టర్‌కు పిర్యాదు చేశారు. స్పందించిన ఆమె విద్యుత్‌శాఖ అధికారులతో ఫోన్ మాట్లాడి ఆశ్రమ పాఠశాలలో ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈసందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు విద్యబుద్దులు, క్రమశిక్షణ నేర్పాల్సిందే ఉపాధ్యాయులదే అని అన్నారు. పాఠశాలలో ఉత్తమ ఫలితాలు రావాలని దానికి సమిష్టిగా కృషి చేయాలని ఉపాధ్యాయులనుకోరారు. అడిషనల్ కలెక్టర్ వెంట ఎంపీవో మల్లెల రవీంద్రప్రసాద్ ఉన్నారు

# ప్రకృతి ప్రసాదించిన ఫలం తునికి పండ్లు

- వేసవిలోనే దొరికే అద్భుత ఫలం
- తునికి పండ్లతో ఆరోగ్య ప్రయోజనాలు ఎన్నో
- ఏడాదికి ఒక్కసారైనా తునికి పండ్లు తింటే చాలు



**చర్ల మార్చి 26 మచ్చా రాజా / నవభూమి ప్రతినిధి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం తెలంగాణ చత్తీస్గడ్ రాష్ట్రం ప్రకృతి సహజ సిద్ధమైన తునికి పండ్లు మనిషి జీవితం మరింత కృత్రితమవుతుంది. అభివృద్ధి పేరుతో చేస్తున్న విధ్వంసం వల్ల ప్రకృతి మొత్తం నాశనం అవుతుంది. అందువల్లే సీజన్లో సరిగ్గా వానలు పడటం లేదు. కాలం కాని కాలంలో వర్షాలు కురుస్తున్నాయి. ఇక ఎండలు గురించి చెప్పాల్సిన పనిలేదు. ఇంతటి విపత్కర పరిస్థితుల్లోను అక్కడక్కడ అడవులు కనిపిస్తున్నాయి. అందులో తునికి చెట్లు దర్శనమిస్తున్నాయి. తునికి చెట్లు నిటారుగా పెరుగుతాయి. వీటి కాండం మందంగా ఉంటుంది. ఆకులు కూడా దళసరిగా ఉంటాయి. ఇవి నవంబరు నుంచి జనవరి నెల వరకు పూస్తాయి. ఆ తరువాత పువ్వులు.. పిందెలుగా మారుతాయి. క్రమ క్రమంగా కాయలుగా రూపాంతరం చెందుతాయి. పక్వ స్థితికి చేరిన తరువాత రాలి కిందపడతాయి. తునికి పండ్లు చూసేందుకు ఎరుపు వర్ణంలో ఉంటాయి. ఇందులో ఉన్న గుజ్జు తీపి, పలుపు రుచుల సమ్మేళనంగా ఉంటుంది. ప్రతీ పండులో రెండు గింజలుంటాయి. పండుపై ఉన్న తొక్క మందంగా ఉంటుంది. తినడానికి రుచికరంగా ఉంటుంది, మధుమేహం ఉన్న రోగులు ఆ పండును తింటే ఎంతో బాగుంటుందని వైద్యులు చెబుతున్నారు. వీటిని ఎక్కువగా ఏజెన్సీలో విక్రయిస్తున్నారు. తునికి పండ్లు అరు దుగా లభిస్తుంటాయి. ఈ చెట్లు కేవలం అడవుల్లో మాత్రమే ఉంటాయి. తెలుగు రాష్ట్రాల్లో భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, భూపాలపల్లి, అదిలాబాద్, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని అటవీ ప్రాంతాల్లో ఈ చెట్లు విపరీతంగా పెరుగుతుంటాయి. మగ తునికాకు చెట్లకు కాయలు కాయవు. కేవలం ఆడ చెట్లకు మాత్రమే కాయలు కాస్తాయి. వీటిని తెలంగాణ సపోటా అని పిలుస్తుంటారు. ఈ పండ్లు కేవలం వేసవి కాలంలో మాత్రమే లభిస్తాయి,





తునికి పండ్లలో లాభాలు మెండు, వీటిలో విటమిన్లు, పోషకాలు అధికంగా ఉంటాయి. ముఖ్యంగా రక్తపోటు, మధుమేహం, మూత్రపిండాల సంబంధిత వ్యాధితో బాధపడే వారికి ఈ పండ్లు తింటే ఎంతో ప్రయోజనం కలుగుతుంది. రక్తపోటును ఈ పండ్లు అదుపులో ఉంచుతాయి. మధుమేహాన్ని నియంత్రిస్తుంది. ఇందులో ఉండే కెరోటినాయిడ్లు. క్యాన్సర్ నిరోధకంగా పనిచేస్తాయి. ఈ పండ్లను ఎక్కువగా తింటారు కాబట్టి ఆదివాసీలు బలంగా ఉంటారు. ప్రస్తుతం ఈ పండ్లను సేకరించి ఆదివాసీలు ఆమ్ముతున్నాయి. కిలో పండ్లు రూ.150 నుంచి 200 వరకు విక్రయిస్తున్నారు. తునికి పండ్లు తిన్న తరువాత వాటి తొక్కను ఎండబెట్టి ఎండిన తొక్కలను దంచి ముఖానికి ప్యాక్ లాగా పూసుకుంటే చర్మంలో మలినాలు తొలగిపోయి మరింత కాంతి వంతంగా కనిపిస్తుందని వైద్యులు నిపుణులు చెబుతున్నారు. వీటిని తినాలంటే వైద్యుల సలహాలు తీసుకోవాలి. దీర్ఘకాలిక రోగాలతో బాదపడే వారు వైద్యుల సలహాల మేరకు ఈ పండ్లు తీసుకోవాల్సి ఉంది. ప్రకృతిలో లభించే సహజమైన పండ్లు తునికి పండ్లను డయో స్పైరోస్ మెలనోక్సిలాన్ అనే శాస్త్రీయ అనే శాస్త్రీయ నామంతో కోర మండల్ బోని అని పిలువబడే టెండు చెట్లను ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో తు నికి అని పిలుస్తారు. ఒడిశా, జార?ండ్, అస్సాంలో దీనిని కెండు లేదా టెండు అ ని పిలుస్తారు. ఈ మొక్క తునికి ఆకులు గిరిజనులకు జీవనోపాధిని అందిస్తా యి. ఎందుకంటే వీటితోనే బీడీలు తయారుచేయడానికి ఉపయోగిస్తారు. ఈ ఆకులను గిరిజనులు స్టైస్టిక్గా గజ్జిగా, పాత గాయాల చికిత్సలో, బేధి మందు, కార్మినేటివ్ ఔషధంగా ఉపయోగిస్తారు. ఇటీవల టెండు పండ్లు చాలా అరుదు గా మారాయి. పరిమిత పరిమాణంలో వస్తాయి. పూర్తిగా పండినప్పుడు వాటికి ఆహ్లాదకరమైన, తీపి పసుపు రంగు గుజ్జు ఉటుంది. ఈ పండ్లలో కార్బోహైడ్రేట్ ప్ర కంటెంట్ తక్కువగా ఉంటుంది. ఫైబర్ అధికంగా ఉంటుంది. అనేక పోషక, ఆ రోగ్య ప్రయోజనాలతో ఉంటుంది. ఒక్కో చెట్టు ఏడాదికి 5000 వరకు కాయలు కాస్తుంది

# శాంతి, సహనం ,సామరస్యతకు ప్రతీక (రోజా )ఉపవాసం

- మహమ్మద్ హమీద్షా మియా సాహెబ్ సైలని బాబా
- తెలంగాణ మైనారిటీ గురుకుల బాలుర పాఠశాల పరకాల1లో దావత్ -ఏ- ఇఫ్తార్ విందు ఏర్పాటు

**ఓగులాపూర్ సైలని నగర్ మార్చి 26 నవభూమి** ఈరోజు ఎస్ వబి ఐ టి క్యాంపస్ నందు తెలంగాణ మైనారిటీ బాలుర గురుకుల పాఠశాల మరియు కళాశాల లో పవిత్ర రంజాన్ రంజాన్ మాసంలో ఉపవాసం చేస్తున్న వారికోసం దావత్ -ఏ- ఇఫ్తార్ విందును పాఠశాల మరియు కళాశాల ప్రిన్సిపాల్ రమేష్ లాల్ హాట్కార్ మరియు ఉపాధ్యాయ ఉపాధ్యాయ బృందం ఏర్పాటు చేయడం జరిగింది . ఈ కార్యక్రమంలో సైలాని నగర్ లో ఉన్నటువంటి సైలని బాబా దర్గా పీఠాధిపతి మొహమ్మద్ హామీద్ షా మియా సైలాని బాబా ఖనఖ్ -ఈ -సైలనియా మరియు డాక్టర్ మఖ్దుమ్ మహబూబ్దిన్ తెలుగు ఉపన్యాసకులు జనాబ్ మొహమ్మద్ అబ్దుల్ రషీద్ సాహెబ్ దావత్ ఏ ఇస్తాన్ విందు లో పాల్గొన్నారు ఈ సందర్భంగా డాక్టర్ మఖ్దుమ్ మాట్లాడుతూ ఇస్లాం మతం యొక్క గొప్పతనం మరియు పవిత్ర రంజాన్ మాసంలో భక్తిశ్రద్ధలతో ఉండే రోజా ఉపవాసం శరీరానికి మరియు ఆత్మకు మరియు మెదడుకు శాంతికి సహనానికి సంబంధించిన విషయాలని భూమిలో ఉన్నటువంటి బంగారం ఖనిజాలు విలువైనవి ఉన్నప్పటికీ ఇంతటి భూమి మీద నిలబడే శక్తి మానవుడికి ఉంది కాబట్టి అన్ని జీవులలో మానవుడి యొక్క మేధస్సు గొప్పదని మరియు విద్యార్థి దశలో కష్టపడి చదివితే సాధించ లేనిది ఏది లేదని ఉపవాసం అనేది కేవలం కడుపుకు సంబంధించింది కాదని కంటికి నోటికి కంటికి మెదడుకు శరీర భాగాలన్నింటికీ సంబంధించిందని వాటిని కనుక నియంత్రణలో ఉంచుకుంటే మానవుని శరీరం ఒక ఆయుధంగా మారుతుందని మానవుడి మేధస్సు ప్రజ్ఞ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని విద్యార్థులకు చదువు యొక్క మరియు ఉపవాసం యొక్క మతం యొక్క గొప్పతనాన్ని గురించి డాక్టర్ డా.మఖ్దుమ్ వివరంగా వివరించడం జరిగింది ఈ సందర్భంగా మహమ్మద్ హమీద్ షా సైలని బాబా మాట్లాడుతూ శాంతి సహనం సామారస్యతకు క్షేమంగా రోజాను భావించవచ్చని ఉపవాసం అనేది అందరికీ సంబంధించిందని ఉపవాసం వల్ల శరీరం ఆయురారోగ్యాలు కూడా పెంచుకోవచ్చని విద్యార్థుల భవిష్యత్తు గురించి విద్యార్థులు చదువు పట్ల శ్రద్ధ వహించాలని విద్యార్థులకు వివరించడం జరిగింది మరియు తెలంగాణ మైనారిటీ గురుకుల బాలుర పాఠశాల మరియు కళాశాల పరకాల బాలురవన్ ప్రిన్సిపాల్ రమేష్ లాల్ మాట్లాడుతూ పవిత్రమైన రంజాన్ మాసం సంవత్సరంలో ఒకసారి వచ్చే ఈ మాసంలో అందరూ ఎంతో సహనంతో శాంతితో ఐక్యమత్యంతో ఉపవాసం ఉండడం జరుగుతుందని విద్యార్థులకు ఉపవాసం యొక్క ప్రాముఖ్యతను వివరించడం జరిగింది మరియు క్రమశిక్షణతో విద్యార్థులు విద్యాముద్దులు






నేర్చుకుంటున్నారని వివరించడం జరిగింది కార్యక్రమంలో పాఠశాల మరియు కళాశాల కోఆర్డినేటర్లు శేఖర్ సార్ మరియు చైతన్య మేడం మల్లేశం సార్ మాధవి మేడం ,మల్లికాంబ మేడం, కుమారస్వామి సార్ శ్రీకాంత్ సార్, నగేష్ సార్, రమా మేడం ఉమా మేడం, సాయి లత మేడం, సత్యం సార్ ,తిరుపతి సార్ ,కీర్తి రాజేష్ సార్, ఉపేందర్ సార్, శశిధర్ సార్ ఆర్టు రాజశేఖర్ సార్, ఇక్బాల్ సార్ మైమూన మేడం, జరీనా మేడం ,నజీరున్నీసాసా మేడం వెంకటరమణ సార్, పీఈటి మల్లేశం సార్, డిప్యూటీ వార్డెన్ ఇలియాస్ సార్ ,అనితారత్నం మేడం, వాచ్మెన్ ముస్తఫా, సాదిక్ మరియు జహీర్ తదితరులు పాల్గొనడం జరిగింది